9th HAPPY ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 11 సంచిక : 334 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం, 8 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :334 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 8 August 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# నేతన్నల సంక్షేమానికి మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయం





- ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.25 వేలు 'నేతన్న భరోసా' కింద సాయం
- చేనేత మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు
- చేనేత ఉత్పత్తులపై 5% జీఎస్టీ రీయింబర్స్‌మెంట్
- ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం

**పెన్ పవర్ డెస్క్:**చేనేత కార్మికుల సంక్షేమం, వారి అభివృద్ధి పట్ల మంత్రి నారా లోకేశ్ చూపిన చిత్తశుద్ధి, పట్టుదల అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఓటమి పాలైనప్పటికీ మంగళగిరి ప్రజలను, ముఖ్యంగా నేతన్నలను అంటిపెట్టుకుని వారి కోసం పనిచేసిన లోకేశ్ కృషి వల్లే ఈరోజు ప్రభుత్వం చేనేతలకు మరింత మేలు చేయగలుగుతోందని అన్నారు. నేడు మంగళగిరిలో జరిగిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత వర్గానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇస్తూ పలు కీలక వరాలను ప్రకటించారు. మంగళగిరిలో మంత్రి లోకేశ్ చొరవతో ఏర్పాటైన 'వీవర్‌శాల'ను సందర్శించిన అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. "గత ఎన్నికల్లో ఓడిపోయినా మంగళగిరిని వీడకుండా, ఇక్కడి నేతన్నల కోసం లోకేశ్ నిరంతరం శ్రమించారు. ప్రతిపక్షంలో ఉండగానే 873 మందికి అత్యాధునిక రాట్నాలు అందించారు. 20 మగ్గాలతో వీవర్‌శాల ఏర్పాటు చేసి, 3,000 కుటుంబాలకు అండగా నిలవడం పేదల పట్ల, చేనేతల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. ఒకప్పుడు 5,000 ఓట్ల తేడాతో ఓడిన చోటే, ఈసారి 91 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలవడం ఆయన సేవకు ప్రజలు ఇచ్చిన తీర్పు" అని చంద్రబాబు కొనియాడారు.

**నేతన్నలపై చంద్రబాబు వరాల జల్లు**

ఈ సందర్భంగా రాష్ట్రంలోని చేనేత కళాకారుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తూ, ప్రతి చేనేత కుటుంబానికి 'నేతన్న భరోసా' పథకం కింద ఏటా రూ.25,000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా, ఈ నెల నుంచే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 93 వేల చేనేత, 50 వేల మరమగ్గాల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని,

-2లో..



## చంద్రబాబును ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని

- చంద్రబాబుకి వయసు పెరిగే కొద్దీ సంకుచిత ఆలోచనా ధోరణి పెరిగిపోతోందన్న పేర్ని నాని
- పులివెందులలో గెలిచి వాపును చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా
- జగన్ అధికారంలోకి వస్తే మీ గతి ఏమవుతుందో ఆలోచించుకోవాలని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకి వయసు పెరిగే కొద్దీ సంకుచిత ఆలోచనా ధోరణి పెరిగిపోతోందని ఆయన మండిపడ్డారు. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిందేనని... అయితే, కేవలం పులివెందుల జడ్పీటీసీకి మాత్రమే బైఎలెక్షన్ పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా పులివెందుల జెడ్పీటీసీకి నామినేషన్ వేశామని చెప్పారు.

వైసీపీ నామినేషన్ వేసినప్పటి నుంచి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రౌడీలను దించారని పేర్ని నాని దుయ్యబట్టారు. చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలను కేవలం సినిమాల్లోనే చూస్తుంటామని అన్నారు. కానీ, ఇప్పుడు చంద్రబాబు వాటిని అందరికీ నేర్పిస్తున్నారని చెప్పారు. బీసీ నేత అయిన వైసీపీ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, రాముపై దాడి చేయించారని మండిపడ్డారు.

కత్తులు, రాడ్లతో పైశాచికంగా దాడి చేశారని, కార్లను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

-2లో..

## రైతుల కోసం ఎంతటి మూల్యమైనా చెల్లిస్తా..

### అమెరికాకు ప్రధాని మోదీ గట్టి కౌంటర్

**భారత ఎగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచిన అమెరికా**

**రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్న ప్రధాని మోదీ**

**దేశ రైతుల కోసం భారత్ సిద్ధంగా ఉందన్న ప్రధాని**



**పెన్ పవర్ డెస్క్:** దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని, వారి కోసం ఎంతటి మూల్యం చెల్లించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసిన మరుసటి రోజే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతీకార చర్యగా భారత ఎగుమతులపై అమెరికా బుధవారం అదనంగా 25 శాతం సుంకాన్ని విధించిన విషయం తెలిసిందే. గత నెల 20న విధించిన 25 శాతంతో కలిపి ఇప్పుడు మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడారు. "రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలే మాకు అత్యంత ప్రాధాన్యం. ఈ విషయంలో భారత్ ఎన్నటికీ రాజీపడదు. ఇందుకోసం నేను వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని తెలుసు. అయినా నేను సిద్ధంగా ఉన్నాను. దేశ రైతుల కోసం భారత్ సిద్ధంగా ఉంది" అని ఆయన తేల్చిచెప్పారు. అమెరికా చర్యపై భారత విదేశాంగ శాఖ కూడా తీవ్రంగా స్పందించింది. రష్యా చమురు దిగుమతుల విషయంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం "అన్యాయమైన, అహేతుకమైన చర్య" అని పేర్కొంది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేసింది. 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకునే తమ దిగుమతులు ఉంటాయని తెలిపింది.

## ఈసీ చేతిలో ప్రజాస్వామ్యం ఖూనీ... మోదీ కోసమే!

- ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయన్న రాహుల్ గాంధీ
- ఎన్నికల ప్రక్రియను ఈసీనే నీరుగారుస్తోందని ఆరోపణ
- మహారాష్ట్రలో 5 నెలల్లో కోటి ఓట్లు పెరగడంపై ప్రశ్నలు
- ఓటర్ల జాబితాల్లో తీవ్ర అవకతవకలున్నాయని విమర్శ
- సీసీటీవీ ఫుటేజ్, డేటా ఇవ్వట్లేదన్న రాహుల్



**పెన్ పవర్ డెస్క్:**కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీ ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సంస్థగా కాకుండా, దాన్ని ఓ క్రమపద్ధతిలో కూల్చివేయడానికి సహకరిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీజేపీతో

-2లో..

## అమెరికా-భారత్ మధ్య పెరిగిన గ్యాప్...

### అవకాశాన్ని అనుకూలంగా మలుచుకునే దిశగా పాకిస్థాన్

- ట్రంప్ సుంకాలతో అమెరికా, భారత్ మధ్య పెరిగిన గ్యాప్
- తమ దేశ ప్రయోజనాలే ముఖ్యమంటున్న భారత్
- ట్రంప్ తీరును తప్పుబడుతున్న సొంత పార్టీ నేతలు
- అమెరికాతో బంధాలను బలోపేతం చేసుకునే దిశగా పాక్ అడుగులు
- మరోసారి అమెరికాకు వెళుతున్న పాక్ ఆర్మీ చీఫ్

-2లో..



## ఇక్కడ పోటీ చేస్తున్నది బీటెక్ రవి భార్య కాదు.. పరోక్షంగా చంద్రబాబే పోటీ చేస్తున్నారు



- రణరంగంగా మారిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక
- టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి భార్య లతారెడ్డి
- పులివెందుల వైసీపీ కుటుంబానికి అడ్డా అన్న కేతిరెడ్డి

**పెన్ పవర్ డెస్క్:**జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో పులివెందుల రణరంగంగా మారింది. ఎన్నిక జరుగుతున్న ఒకే ఒక్క జడ్పీటీసీ స్థానంలో 11 మంది పోటీ చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి భార్య మారెడ్డి లతారెడ్డి, వైసీపీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి మొయిళ్ల శివకళ్యాణ్ రెడ్డి బరిలోకి దిగారు.

పులివెందుల వైఎస్ కుటుంబానికి కంచుకోట కావడంతో వైసీపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ప్రచార రంగంలోకి దిగారు. వైసీపీ గెలుపు కోసం తమవంతు ప్రయత్నం చేస్తున్నారు.

ఈ క్రమంలో ధర్మవరం వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఈరోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... జడ్పీటీసీ ఎన్నికను తాము అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. పులివెందుల వైఎస్ కుటుంబానికి అడ్డా అని... ఆ నమ్మకాన్ని మరోసారి నిలబెట్టేందుకే తాను ఇక్కడకు ప్రచారం కోసం వచ్చానని చెప్పారు.

ఇక్కడ పోటీ చేస్తున్నది బీటెక్ రవి భార్య లతారెడ్డి కాదని...

-2లో..

## ఉప రాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ




- సెప్టెంబర్ 9న ఎన్నికలు, అదే రోజు ఓట్ల లెక్కింపు
- నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 తుది గడువు
- 25న నామినేషన్ల ఉపసంహరణ

**పెన్ పవర్ డెస్క్:**ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 9న ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెబుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు నోటిఫికేషన్ విడుదల చేసింది.

నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21న చివరి తేదీగా ప్రకటించింది. 22న నామినేషన్ల పరిశీలన,

-2లో..

## చేనేత కళాకారుల ఆదాయం రెట్టింపు చేస్తా



**మంగళగిరిలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు**

**చేనేత కార్మికులు కాదు, కళాకారులంటూ మంత్రి లోకేష్ ప్రశంస**

**యువగళంలో ఇచ్చిన హామీలను నెరవేర్చామని వెల్లడి**

**పెన్ పవర్ డెస్క్:**చేనేత కార్మికులను కేవలం కార్మికులుగా కాకుండా, అద్భుతమైన డిజైన్లు సృష్టించే కళాకారులుగా గౌరవిస్తానని, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తన లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. గురువారం నాడు మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్ శాల వద్ద నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా

-2లో..

## జమ్మూ కశ్మీర్‌లో ఘోర ప్రమాదం.. లోయలో పడ్డ సీఆర్పీఎఫ్ వాహనం..

- జమ్మూకశ్మీర్‌లోని ఉధంపుర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- లోయలో పడిపోయిన సీఆర్పీఎఫ్ జవాన్ల వాహనం
- ఘటనా స్థలంలోనే ముగ్గురు జవాన్ల మృతి
- మరో 10 మందికి తీవ్ర గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం
- రంగంలోకి దిగిన ఆర్మీ హెలికాప్టర్లు, కొనసాగుతున్న సహాయక చర్యలు



-2లో..

# నేతన్నందరికీ శుభాకాంక్షలు

## జాతీయ చేనేత దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన వైయస్ జగన్



**పెన్ పవర్ డెస్క్:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలందరికీ వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా సంత్ కబీర్ అవార్డు అందుకుంటున్న లక్క శ్రీనివాసులు (తిరుపతి), నేషనల్ హ్యాండ్‌లూమ్ అవార్డులు అందుకుంటున్న కర్నాటి మురళి (చీరాల), జుజరె నాగరాజు (పొందూరు)లకు అభినందనలు తెలుపుతూ వైయస్ జగన్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

నేతన్నల జీవితాలు బాగుపడాలన్న ఉద్దేశంతో మా ప్రభుత్వ హయాంలో వారికి ప్రతి అడుగులోనూ అండగా నిలిచాం. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా 'వైయస్ఆర్ నేతన్న నేస్తం పథకం– ద్వారా ప్రతి ఏటా రూ.24,000 నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేశాం. వైయస్ఆర్ నేతన్న నేస్తం కింద రూ.969.77 కోట్లు, నేతన్నల పింఛన్ కోసం రూ.1,396.45 కోట్లు, ఆప్కోకు పాత బకాయిలు రూ.468.84 కోట్లు చెల్లించాం. అంతేకాదు వివిధ పథకాల ద్వారా నేతన్నలకు రూ.3,706.16 కోట్లు సాయం చేశాం. ఇది ఒక రికార్డు.

**నేతన్నలకు ఉచిత విద్యుత్, పవర్ లూమ్స్ కు రాయితీపై విద్యుత్ అందించాం.**

చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి నేతన్నల ఆదాయం పెంచేందుకు ప్రముఖ ఈ–కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. ఇలా ప్రతి అడుగులోనూ చేనేతలకు అండగా నిలిచాం.

ఈ ప్రభుత్వం చేనేతలకు నడుస్తున్న పథకాలను ఆపేసి ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికి వదిలేసింది.

జీఎస్టీ రీయింబర్స్ చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. దీన్ని అమలు చేయాలంటే దాదాపు రూ.250 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతన్నలు చెబుతున్నారు. రెండు బడ్జెట్‌లలో పెట్టింది సున్నా.

పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అన్నారు. 14 నెలలు గడిచినా అమలు చేయలేదు.

కరెంటు సబ్సిడీ ఇవ్వలేదు, కానీ కరెంటు ఛార్జీలు అమాంతంగా పెంచారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు రూ.19వేల కోట్ల మేర కరెంటు షాక్ ఇచ్చారు. మరి ఈ ప్రభుత్వం చేనేతలను ఏ రకంగా ఆదుకున్నట్లు?

పత్రికల్లో ప్రకటనలు తప్ప ఏమీ కనిపించడం లేదు. అన్ని వర్గాల మాదిరిగానే చంద్రబాబు చేనేతలను వంచించారు, మోసం చేశారు.

# ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరు?..

# ఫైనల్ చేసే బాధ్యత ఆ ఇద్దరిదే!

**ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై ఎన్డీయే కూటమి కీలక నిర్ణయం**

**అభ్యర్థిని ఖరారు చేసే పూర్తి బాధ్యత ప్రధాని మోదీ, జేపీ నడ్డాలకు అప్పగింత**

**రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన భేటీలో ఏకగ్రీవ తీర్మానం**

**ఆరోగ్య కారణాలతో జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన పదవి**

**సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక, అదే రోజు ఓట్ల లెక్కింపు**

**ఎన్డీయే అభ్యర్థికే విజయావకాశాలు.. ఇప్పటికే మిత్రపక్షాల సంపూర్ణ మద్దతు**



**పెన్ పవర్ డెస్క్:** ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) కీలక నిర్ణయం తీసుకుంది. తమ కూటమి తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే పూర్తి అధికారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు అప్పగిస్తూ గురువారం నాడు ఏకగ్రీవంగా తీర్మానించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ల సమావేశం జరిగింది. ఈ భేటీకి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్యసభాపక్ష నేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వివరాలను మీడియాకు వెల్లడించారు. "రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించే బాధ్యతను ప్రధాని మోదీ, జేపీ నడ్డాలకు అప్పగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం. వారు తీసుకునే నిర్ణయానికి ఎన్డీయేలోని భాగస్వామ్య పక్షాలన్నీ కట్టుబడి ఉంటాయి," అని ఆయన స్పష్టం చేశారు.

ఆరోగ్య కారణాలను చూపుతూ జగ్‌దీప్ ధన్‌ఖడ్ జులై 21న అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. "ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, వైద్యుల సలహా మేరకు నేను భారత ఉపరాష్ట్రపతి పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను," అని తన రాజీనామా లేఖలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 21 నామినేషన్లకు చివరి తేదీ కాగా, సెప్టెంబర్ 9న పోలింగ్, ఓట్ల లెక్కింపు జరగనుంది. పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ ఉన్నందున, కూటమి బలపరిచిన అభ్యర్థి విజయం లాంఛనమే కానుంది. జేడీ(యూ), శివసేన, అప్నా దళ్ సహా పలు మిత్రపక్షాలు ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీజేపీకి బేషరతు మద్దతు ప్రకటించాయి.

# నేతన్నల సంక్షేమానికి మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయం

- మొదటి పేజీ తరువాయి

దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.190 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు.

**జీఎస్టీ రీయింబర్స్‌మెంట్**

చేనేత ఉత్పత్తులపై విధిస్తున్న 5 శాతం జీఎస్టీని ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందని, దీనికోసం ఏటా రూ.15 కోట్లు కేటాయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రూ.5 కోట్లతో పొదుపు నిధి (థ్రిఫ్ట్ ఫండ్) ఏర్పాటు చేసి 5,386 మంది కళాకారులకు ప్రయోజనం కల్పిస్తామన్నారు. చేనేత హక్కుల కోసం పోరాడిన యోధుడు ప్రగడ కోటయ్య జయంతిని ఇకపై అధికారికంగా నిర్వహిస్తామని, విజయవాడ–గుంటూరు జాతీయ రహదారిపై ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**బీసీలకు అండగా ఉంటాం**

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. నాయి బ్రాహ్మణుల సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని, దీని ద్వారా 40 వేల కుటుంబాలకు మేలు జరుగుతుందని ప్రకటించారు. త్వరలోనే 'ఆదరణ–3' పథకాన్ని ప్రారంభిస్తామని, గీత కార్మికులకు, వడ్డెరలకు, మత్స్యకారులకు, యాదవులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి బెదిరింపులకు లొంగకుండా కూటమికి అండగా నిలిచిన బీసీల సంక్షేమానికి తన చివరి శ్వాస వరకు పనిచేస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# చేనేత కళాకారుల ఆదాయం రెట్టింపు చేస్తా

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను, మగ్గాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ, "దారానికి రంగు వేయడం నుంచి చీర నేసే వరకు నేతన్నలు పడే కష్టం నేను ప్రత్యక్షంగా చూశాను. అందుకే వారిని చేనేత కళాకారులుగా పిలుస్తున్నాను" అని అన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, మంగళగిరి ప్రజలు తనను సొంత కుటుంబ సభ్యుడిలా ఆదరించారని గుర్తుచేసుకున్నారు. ఆ ఓటమి తనలో కసి పెంచిందని, ఐదేళ్లు ప్రజలకు అండగా నియోజకవర్గంలోనే పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చేనేతలను ప్రోత్సహించడానికి 873 రాట్నాలను ఉచితంగా అందించామని, కరోనా కష్టకాలంలోనూ అండగా నిలిచామని లోకేశ్ వివరించారు. వీవర్ శాల ఏర్పాటు, టాటా తనేరా సంస్థతో ఒప్పందం వంటి చర్యల ద్వారా ఇప్పటికే చేనేతల ఆదాయం 30 శాతం పెరిగిందని, అయితే వారి ఆదాయం రెట్టింపు అయ్యేవరకు తాను సంతృప్తి చెందనని అన్నారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం కూడా ప్రత్యేక సంఘం ఏర్పాటుచేసి ఆరోగ్య బీమా, ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

యువగళం పాదయాత్రలో చేనేతలను దత్తత తీసుకుంటానని చెప్పిన మాటను కొందరు ఎగతాళి చేశారని, కానీ చేనేత రంగాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఆ నిర్ణయం తీసుకున్నానని లోకేశ్ ఉద్ఘాటించారు. తన కుటుంబం మంగళగిరి చేనేత వస్త్రాలనే వినియోగిస్తుందని, జాతీయ నేతలను కలిసినప్పుడు మంగళగిరి శాలువాలనే బహూకరిస్తానని చెప్పారు.

యువగళంలో చేనేతలకు ఇచ్చిన హామీలైన థ్రిఫ్ట్ ఫండ్ పునరుద్ధరణ, చేనేత భరోసా కింద రూ.25వేల ఆర్థిక సాయం, స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలను సీఎం చంద్రబాబు సహకారంతో నెరవేర్చామని లోకేశ్ ప్రకటించారు. ముఖ్యమంత్రి సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 200 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లోకేష్ వివరించారు. 31 కమ్యూనిటీ హాళ్లు, మోడల్ లైబ్రరీ, నాలుగు లేన్ల రహదారి, 100 పడకల ఆసుపత్రి, భూగర్భ డ్రైనేజ్, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, ఎయిమ్స్ అభివృద్ధి వంటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకమ్మ, చిల్లపల్లి శ్రీనివాసరావు వంటి వారికి రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చి తగిన గుర్తింపు కల్పించామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్. సవిత, సుచిత్ర ఎల్లా, పంచుమర్తి అనూరాధ, తమ్మిశెట్టి జానకీదేవి, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా–భారత్ మధ్య పెరిగిన గ్యాప్...

# అవకాశాన్ని అనుకూలంగా మలుచుకునే దిశగా పాకిస్థాన్

**పెన్ పవర్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అదనపు సుంకాలతో భారత్ ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాన్ని ఆయన చేస్తున్నారు. మరోవైపు, ఆపరేషన్ సిందూర్ తర్వాత గత జూన్ లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా వైట్ హౌస్ లో మునీర్ కు గౌరవ మర్యాదలు లభించాయి. ఆ పర్యటన సందర్భంగా ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతికి మునీర్ మద్దతు ప్రకటించారు. తాజాగా మునీర్ మరోసారి అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న ఇండియాపై ట్రంప్ 50 శాతం సుంకం విధించారు. తొలుత సుంకాలను 25 శాతం పెంచిన ట్రంప్... భారత్ తన దారిలోకి రాకపోయేసరికి జరిమానాగా సుంకాలను మరో 25 శాతం పెంచారు. ఇదే సమయంలో పాకిస్థాన్ పై స్వల్ప సుంకాలను విధించారు.

ఈ క్రమంలో అమెరికాతో భారత్ కు గ్యాప్ కొంత పెరిగింది. తమకు తమ దేశ ప్రయోజనాలే ప్రధానమని భారత్ స్పష్టం చేసింది. ట్రంప్ వ్యవహారశైలిపై భారత్ లో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్ పార్టీకి చెందిన కొందరు నేతలు కూడా ఆయన తీరును తప్పుబడుతున్నారు. నమ్మకమైన మిత్రదేశం భారత్ తో కయ్యం వద్దని హితవు పలుకుతున్నారు. మరోవైపు, ఇదే సమయంలో... అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి పాక్ ప్రయత్నిస్తోంది. భారత్, అమెరికా మధ్య కొంత మేర బలహీనపడ్డ బంధాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే జనరల్ మునీర్ మరోసారి అమెరికాకు వెళ్తున్నారు.

# ఉప రాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

- మొదటి పేజీ తరువాయి

25న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. సెప్టెంబర్ 9న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని ఈసీ పేర్కొంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ జులై 21న ఆరోగ్య కారణాలతో ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ అయింది. ఆయన పదవీకాలం వాస్తవానికి ఆగస్టు 2027 వరకు ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మధ్యంతర ఎన్నికల ద్వారా ఎన్నికైన వ్యక్తికి పూర్తి ఐదేళ్ల పదవీకాలం ఉంటుంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 ప్రకారం పార్లమెంటులోని ఉభయ సభల (లోక్‌సభ, రాజ్యసభ) సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నికలో ఎంపీలందరూ (ఎన్నికైనవారు, నామినేటైనవారు) పాల్గొంటారు. సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు పద్ధతి ద్వారా ఈ ఎన్నికలు రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయి.

# చంద్రబాబును ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని

- మొదటి పేజీ తరువాయి

జగన్ అధికారంలోకి వస్తే మీకు ఎలాంటి గతి పడుతుందో మీరే ఆలోచించుకోవాలని హెచ్చరించారు.

పులివెందులలో జరిగిన దాడి గురించి పోలీసులకు ముందే తెలుసని పేర్ని నాని ఆరోపించారు. సినిమా స్క్రిప్ట్ మాదిరి మొత్తం వ్యవహారం పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగిందని అన్నారు. పులివెందులలో గెలిచామని తమ వాపును చూపించుకునే ప్రయత్నాన్ని చంద్రబాబు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక్క కేసు లేనివారిపై కూడా బైండోవర్లు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదని అన్నారు. జనాలను భయభ్రాంతులకు గురిచేసి గెలిచామని జబ్బలు చరుచుకోవద్దని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషనర్ మౌనంగా ఉంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషనర్ ను కోరామని చెప్పారు.

# విజయవాడలో రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ

# ఏసీబీకి చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ

**విజయవాడలో ఏసీబీకి చిక్కిన గిరిజన సంక్షేమ ఈఎన్‌సీ అబ్బవరపు శ్రీనివాస్**

**లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు**

**ఏకలవ్య స్కూళ్ల బిల్లుల కోసం రూ. 25 లక్షలు డిమాండ్**

**కాంట్రాక్టర్ నుంచి నగదు స్వీకరిస్తుండగా అరెస్ట్**

**భారీ అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ**

**పెన్ పవర్ డెస్క్:** తెంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖలో ఓ ఉన్నత స్థాయి అధికారి అవినీతి బాగోతం బయటపడింది. ఆ శాఖ ఇంజనీర్–ఇన్–చీఫ్ (ఈఎన్‌సీ) అబ్బవరపు శ్రీనివాస్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విజయవాడలో అరెస్ట్ చేశారు. ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 25 లక్షల లంచం తీసుకుంటుండగా ఆయన రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం సంచలనం సృష్టించింది.

వివరాల్లోకి వెళితే... రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన నిర్మాణ పనుల బిల్లులను మంజూరు చేసేందుకు కాంట్రాక్టర్ కృష్ణంరాజు నుంచి ఈఎన్‌సీ శ్రీనివాస్ లంచం డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపు కోసం మొత్తం రూ. 50 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గుత్తేదారు ఇప్పటికే రూ. 25 లక్షలు చెల్లించారు.

అయితే, మిగిలిన రూ. 25 లక్షల కోసం శ్రీనివాస్ తీవ్రంగా ఒత్తిడి చేయడంతో, వేధింపులు తట్టుకోలేక కాంట్రాక్టర్ కృష్ణంరాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం గురువారం నాడు శ్రీనివాస్ రూ. 25 లక్షల నగదును స్వీకరిస్తున్న సమయంలో అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంలోని కీలకమైన శాఖలో ఇంజనీర్–ఇన్–చీఫ్ స్థాయి అధికారి లంచం కేసులో పట్టుబడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# జమ్మూ కశ్మీర్‌లో ఘోర ప్రమాదం..

# లోయలో పడ్డ సీఆర్పీఎఫ్ వాహనం..

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం లోతైన లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనలో మరో 10 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే.. ఉధంపూర్ జిల్లాలోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఈ విషాదం జరిగింది. కొండ ప్రాంతంలోని ఒక ప్రదేశానికి వెళ్తుండగా, మలుపు వద్ద డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం రోడ్డుపై నుంచి జారి పక్కనే ఉన్న లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు దుర్మరణం పాలయ్యారని అధికారులు ధ్రువీకరించారు.

ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని వెంటనే ప్రమాద స్థలం నుంచి బయటకు తీశారు. గాయపడిన 10 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించారు. ఉధంపూర్ డిప్యూటీ కమిషనర్ అభ్యర్థన మేరకు, తీవ్రంగా గాయపడిన వారిని తరలించేందుకు ఆర్మీ హెలికాప్టర్లను రంగంలోకి దించారు.

ఈ ఘటనపై స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "బసంత్‌గఢ్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ వాహనం ప్రమాదానికి గురైన వార్త కలచివేసింది. డిప్యూటీ కమిషనర్ సలోని రాయ్‌తో మాట్లాడాను. ఆమె స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సహాయక చర్యలు తక్షణమే ప్రారంభమయ్యాయి. స్థానికులు కూడా స్వచ్ఛందంగా సాయం చేస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు.

జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి, రాంబన్, ఉధంపూర్ వంటి కొండ ప్రాంతపు జిల్లాల్లో ప్రమాదకరమైన రహదారులు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి కారణాలతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ విభాగం అధికారులు తెలిపారు. ప్రాణాంతకమైన ప్రమాదాలను నివారించేందుకు ఈ జిల్లాల్లో ప్రత్యేక ట్రాఫిక్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు.

# ఇక్కడ పోటీ చేస్తున్నది

# బీటెక్ రవి భార్య కాదు..

# పరోక్షంగా చంద్రబాబే పోటీ చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

పరోక్షంగా సీఎం చంద్రబాబే పోటీ చేస్తున్నారని కేతిరెడ్డి అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కుప్పంలో అనేక స్థానాల్లో తమ పార్టీ గెలుపొందిందని గుర్తు చేశారు. పులివెందులను ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలందరికీ తెలుసని అన్నారు.

# ఈసీ చేతిలో

# ప్రజాస్వామ్యం ఖూనీ...

# మోదీ కోసమే!

- మొదటి పేజీ తరువాయి

ఈసీ కుమ్మక్కై ఎన్నికల ప్రక్రియను పూర్తిగా తారుమారు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు.

ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా విశ్వసనీయతపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. "అసలు ఓటర్ల జాబితా కచ్చితంగా ఉందా? సరైన వ్యక్తులు ఓటు వేయగలుగుతున్నారా? ప్రజల్లో తీవ్రమైన అనుమానాలు ఉన్నాయి, వాటికి బలమైన కారణాలు కూడా ఉన్నాయి" అని రాహుల్ అన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలో ఏకంగా కోటి మంది కొత్త ఓటర్లు ఎలా పెరిగారని ఆయన ప్రశ్నించారు. "లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మేము ఘన విజయం సాధించాం. కానీ కొన్ని నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయాం. ఈ మధ్యలో కోటి మంది కొత్త ఓటర్లు పుట్టుకొచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీని కోరినా వారి నుంచి సమాధానం లేదు" అని ఆయన పేర్కొన్నారు.

అంతేకాకుండా, హర్యానా, మధ్యప్రదేశ్‌లలో ఒపీనియన్ పోల్స్‌కు, తమ అంతర్గత సర్వేలకు, వాస్తవ ఫలితాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, ఫలితాలను ముందుగానే నిర్దేశించినట్లుగా ఉందని రాహుల్ ఆరోపించారు. మహారాష్ట్రలో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దగా క్యూలు లేనప్పటికీ, సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం అమాంతం పెరిగిపోవడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు.

విశ్లేషణ కోసం ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీలను ఈసీ ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తోందని, సీసీటీవీ ఫుటేజ్‌ను ధ్వంసం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. "ప్రధాని మోదీ కేవలం 25 సీట్ల మెజారిటీతో ఉన్న ప్రధాని. ఆయన అధికారంలో కొనసాగాలంటే 25 సీట్లను దొంగిలిస్తే సరిపోతుంది. అందుకే ఎన్నికల సంఘం నిజాలను కప్పిపుచ్చుతోంది" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# పెన్ పవర్
## ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు








## వర్షం రాలదు.. నీరు రాదు...
# ఎండిపోతున్న పంటలు!

- ప్రత్తిపాడు రైతుల హృదయవిదారక ఆవేదన
- కలెక్టర్ స్పందించాలని రైతుల వినతి

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 07 :** ఎండలు మండిపోతున్నాయి.. చెరువులు అడుగంటుతున్నాయి.. పంటలు ఎండిపోతున్నాయి. ఇదే ప్రత్తిపాడు మండలంలో వాస్తవ పరిస్థితి. మండలంలోని వేలాది మంది రైతులు ప్రస్తుతం తీవ్ర వర్షాభావంతో తల్లడిల్లుతున్నారు. శ్రమించి దమ్ములు చేసిన పొలాల్లో ఇప్పటికీ నీటి జాడలే లేవు. నారు వేసి నాట్లకు సిద్ధమవుతున్న ఈ సమయంలో నీటి కొరత వారిని మానసికంగా, ఆర్థికంగా అధోగతికి నెట్టేసింది. మండలంలోని వెంకన్నదొర చెరువు, పెదశంకర్లపూడి చెరువు, లంపకలోవ చెరువు సహా మొత్తం చెరువులు ఎండిపోయాయి. నీటి జాడే లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే విత్తనాలు, ట్రాక్టర్ ఖర్చులు చేసిన రైతులు చేతులబట్టి కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రత్తిపాడు మండలంలో వర్షాలు లేక ఎండలు మండిపోతున్న కారణంగా పంట పొలాలు పాడవుతున్నాయి. రైతుల ఆశలన్నీ బూడిదవుతున్న పరిస్థితి నెలకొంది. దాదాపు 850 ఎకరాలకు ముఖ్య నీటిపారుదల వనరైన వెంకన్నదొర చెరువు పూర్తిగా ఎండిపోయింది. పంటలకు నీటి రాహిత్యంతో నారు వేసేందుకు కూడా పరిస్థితులు అనుకూలించక, పాడైపోతున్న దమ్ములను చూస్తూ రైతులు ఆవేదన చెందుతున్నారు. వెంకన్నదొర చెరువుతో పాటు మండలంలోని ఇతర చెరువులు, సాగునీటి వనరులు కూడా అడుగంటాయి. ఈ చెరువు ఆధారంగా పెదశంకర్లపూడి (700 ఎకరాలు), చిన్నశంకర్లపూడి (60 ఎకరాలు), రాయవరం (50 ఎకరాలు), జగన్నాథపురం (40 ఎకరాలు) గ్రామాల్లోని భూములు సాగు చేయాల్సి ఉంది. కానీ ఎండలు భయంకరంగా ఉండటం, వర్షాలు పడకపోవడం వల్ల నాగులకొండ క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి చెరువుకు నీరు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో, రైతులు తమ పంటలను కాపాడుకోవాలంటే ఏలేరు ఎడమ కాలువ నుంచి వెంకన్నదొర చెరువుకు పంపింగ్ ద్వారా నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. అవసరమైతే సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్ట్ గేట్లు ముందుగా ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ గారు లంపకలోవ, పెదశంకర్లపూడి తదితర గ్రామాల్లోని పొలాల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని, అలాగే తక్షణమే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా విజ్ఞప్తి చేశారు.

ఈ సీజన్‌లో రైతులు నారు తీసి నాట్లు వేయాలనుకుంటున్నప్పటికీ నీరు లేక చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికే వేసిన దమ్ములు ఎండిపోతున్నాయి. రైతులకు నష్ట పరిహారం కాకుండా, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటే, పంటలను కాపాడుకోవచ్చు అన్న ఆశను రైతులు పంచుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాల్లో పర్యటించి మండలంలోని రైతులకు భరోసా కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, కాలువల పరిస్థితిని గమనించాలని, భవిష్యత్తు సాగుకు మార్గం చూపాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా కలెక్టర్‌ను కోరుతున్నారు. పంటలు ఎండిపోతే సమస్య కేవలం రైతులకే కాదు. దానితో పాటు విత్తన కేంద్రాలు, పనివాళ్లు, రవాణా కార్మికులు, చిన్న వ్యాపారులు %-% గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం దెబ్బతింటుంది. ఉపాధి కోల్పోయిన వలస కూలీల సంఖ్య పెరిగే ప్రమాదముంది. వ్యవసాయ ఆధారిత గ్రామాల్లో ఇది తీవ్రమైన సామాజిక సమస్యగా మారే అవకాశం ఉంది.

# శరభవరం సచివాలయ ఉద్యోగి కిడ్నాప్...





- కత్తులతో బెదిరించి అపహరణ..
- స్థానికుల ఎదురు ప్రయత్నం విఫలం..
- ఇంజనీరింగ్ అసిస్టెంట్ సౌమ్య అదృశ్యం..
- ఏజెన్సీ ప్రాంతంలో భయావహ వాతావరణం..
- దుండగుల దౌర్జన్యం కలకలం..
- కొనసాగుతోంది పోలీసుల గాలింపు చర్యలు..

**దేవీపట్నం,పెన్ పవర్,ఆగస్టు7:**దేవీపట్నం మండలం శరభవరం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగి సౌమ్య కిడ్నాప్‌కు గురైన ఘటన దేవీపట్నం మండలాన్ని కుదిపేసింది.కత్తులతో బెదిరించి ఆమెను అపహరించిన దుండగుల చర్యకు స్థానికులు షాక్‌కు గురయ్యారు.ప్రాథమిక సమాచారం ప్రకారం,కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు సచివాలయం వద్దకు వచ్చి సౌమ్యను బలవంతంగా వాహనంలోకి ఎక్కించుకొని తరలించారు.ఈ క్రమంలో ఆమెకు సహాయం చేయడానికి ప్రయత్నించిన స్థానికులను కూడా వారు బెదిరించినట్టు తెలుస్తోంది.దుండగులు కత్తులతో వస్తూ ఉండటంతో ప్రజలు భయంతో వెనక్కి తగ్గారు.దీంతో సౌమ్యను వారు అపహరించడంలో విజయవంతమయ్యారు.ఈ ఘటనకు సంబంధించి పూర్తిగా వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి,కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.సీసీ కెమెరాలు,సాక్ష్యాధారాల సేకరణతో పాటు,సౌమ్యను కిడ్నాప్ చేసిన వారి దారితీయడంపై ప్రత్యేక దర్యాప్తు బృందం పనిచేస్తోంది.ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి ఘటనలు నమోదు కాకపోవడంతో ఈ కిడ్నాప్ స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రశ్నలు మిగిలిపోతున్నాయి.సచివాలయ ఉద్యోగులు మరియు ప్రజలు భయంతో ఉన్నారు.సౌమ్యను త్వరగా కాపాడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని,పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

సాఫ్ట్ స్కిల్స్ లో ప్రావీణ్యం సాధించాలి : రిటైర్డ్ మేజర్ జె.వి. ప్రసాద్ సూచన

-4లో




## ఉలిగోగులలో కలెక్టర్ పర్యటన - గిరిజనుల ఆశలకు నూతన దిశ





- పెన్ పవర్ కథనానికి స్పందన
- ఉలిగోగుల ప్రజలకు కలెక్టర్ వరాల జల్లు
- సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న కలెక్టర్
- కలెక్టర్ పర్యటనతో హర్షం వ్యక్తం చేసిన గిరిజనులు

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 07 :**
ప్రత్తిపాడు మండలం బురదకోట పంచాయతీ పరిధిలోని ఉలిగోగుల గ్రామం చాలాకాలంగా వెనుకబడి ఉన్న గిరిజన గ్రామంద.. ఉలిగోగుల. బురద, బాట, బాధలు... మూడు పదాలే అక్కడి జీవన పరిస్థితిని చెప్పగలవు. కానీ ఆ గ్రామంలో ఈవారం ఓ చరిత్ర జరిగింది. గురువారం కలెక్టర్ వచ్చారు. అదే గిరిజనుల ఆశకు తొలి మెట్టు. ప్రభుత్వ పద్ధతుల్లో 'సాధారణ పర్యటన'గా కనిపించినా, గిరిజనుల జీవితాల్లో అది 'నాకు గుర్తుండిపోయే రోజు సార్' అన్నట్టుగా మారిపోయింది. గురువారం జరిగిన ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ప్రత్తిపాడు, లంపకలోవ, రౌతుపాలెం మీదుగా ప్రయాణించి ఎట్టకేలకు ఉలిగోగుల గ్రామానికి చేరుకున్నారు. అధికార యంత్రాంగాన్ని మొత్తం తన వెంట తీసుకొచ్చారు. రెవిన్యూ, విద్య, వైద్యం, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖలతోపాటు ఎంపీడీవో, తహసీల్దార్, వైద్యాధికారులు, ఎంపీవోలు, ఎంఈఓలు, మరెన్నో శాఖల అధికారులు కూడా కలెక్టర్ వెంట ఉన్నారు. ఈ పర్యటన మామూలు పరామర్శ కాదు, సమస్యలపై చొరవగా స్పందించి పరిష్కార మార్గాలు వెతకడమే లక్ష్యంగా సాగింది.

గ్రామంలో నివసిస్తున్న 37 గిరిజన కుటుంబాలు కలెక్టర్‌ను ఊరంతా ఎదురెళ్లి స్వాగతించాయి. "మా వూరికి కలెక్టర్ వచ్చారు సార్... ఇదే మాకు గొప్ప విషయం" అంటూ వారి హృదయానికి తాకే మాటలతో కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల వద్ద విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. ఉపాధ్యాయునితో మాట్లాడి పాఠశాలలో విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

గత సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశంలో కాకూరు వెంకటలక్ష్మి అనే మహిళ ఉలిగోగుల ప్రాంత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యమే ఈ పర్యటనకు కారణమైంది. ఆమె వివరించిన అంశాలన్నింటినీ పట్టించుకుని, స్వయంగా గ్రామంలో అడుగుపెట్టి పరిశీలించడం కలెక్టర్ బాధ్యతను స్పష్టంగా వెల్లడించింది.

కలెక్టర్ స్పందన – సమస్యలకు స్పష్టమైన చర్యలు

కలెక్టర్ మాట్లాడుతూ "ఉలిగోగుల ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. తాగునీటి సరఫరా, రోడ్డు నిర్మాణం, హౌసింగ్ సమస్య, విద్యుత్ స్తంభాల మరమ్మత్తులు, ఉపాధి హామీ బిల్లుల బకాయిలు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం," అన్నారు.

**ప్రధాన అంశాలపై కలెక్టర్ హామీలు:**

హౌసింగ్ సమస్య: గ్రామానికి గ్రామకంఠం (ల్యాండ్ పట్టా) లేకపోవడం వల్ల ఇళ్లు మంజూరు కాలేదని, దీనిపై పరిష్కారం కోసం చర్చలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ సమస్య: స్తంభాలు పాతవైపోయాయని, మరమ్మత్తులు అవసరమని ప్రజలు విన్నవించగా, విద్యుత్ శాఖ అధికారులతో ఆ వెంటనే చర్చించారు.

తాగునీరు, రోడ్లు: ఉలిగోగులకు రోడ్డు మంజూరు జరిగిందని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

ఆరోగ్య సేవలు: ఏఎన్ఎం బదిలీపై వెళ్లిన విషయాన్ని గుర్తించి, తిరిగి ఆమెను నియమించాలని సూచించారు.

ఉపాధి హామీ పనులు: బిల్లులు విడుదల కావలసిన విషయంపై పరిగణనలోకి తీసుకుంటామని, నిబంధనలతో సరిపోలేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజల స్పందన – కలెక్టర్‌ను చూసి తీరిన సంతృప్తి

గిరిజనులు ఎప్పుడూ అందుబాటులో లేని అధికారులను చూస్తేనే ఆత్మవిశ్వాసం పుట్టుకొస్తుంది. కలెక్టర్ స్వయంగా వారింటి ముందుకురావడం వల్ల, సమస్యలు నేరుగా చెప్పుకోవడానికొచ్చిన అవకాశం రావడంతో గిరిజన ప్రజల కళ్లు ఆనందంతో నిండిపోయాయి. కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో కుమార్ బాబు, వైద్యాధికారి డా. కె.యశస్వి, ఎంఈఓలు వి. రాజబాబు, వై. అచ్చిరాజు, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. పర్యటన పూర్తయ్యేలోపే సమస్యల పరిష్కారానికి ప్రణాళికను ఖరారు చేయడం విశేషం.





# చెరువులపై ఆక్రమణలు..!

## హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సుంకర...
## గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం 99 అక్రమ నిర్మాణాలు గుర్తింపు...





**కపిలేశ్వరపురం పెన్ పవర్ ఆగస్టు 7:** పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల కాపాడటంలో కీలకపాత్ర పోషించే చెరువులు నేటి కాలంలో అక్రమ ఆక్రమణల కారణంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలంలోని అంగర గ్రామ చెరువు కూడా ఇలాంటి దురవస్థకు లోనవుతోంది. చెరువుగట్టు ప్రాంతంలో భారీగా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సుంకర కృష్ణ అనే వ్యక్తి చెరువు పరిస్థితిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు, మండల తహసీల్దార్ జి. శ్రీనివాసు ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు రావడంతో, చెరువును సర్వేయర్లతో కొలతలు కొలిపించారు. పంచాయతీ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం సుమారు 10 ఎకరాలు 60 సెంట్లు. ఇందులో ఎంత భాగం ఆక్రమించబడ్డదీ గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ సర్వే నివేదికను త్వరలోనే జిల్లా అధికారులకు పంపించనున్నట్లు సమాచారం. చెరువుగట్టు పరిసరాల్లో పక్కా ఇళ్లు, షాపులు, షెడ్లు తదితరంగా దాదాపు 99 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు పంచాయతీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అయినా ఇప్పటివరకు పట్టించుకోని విధానం వల్లే,చెరువులు నాశనమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇలాంటి ఘటనల్లో ఇది ఒక్కటే కాదు. 2022లో కోరుమిల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, గ్రామంలోని బసవరాజు చెరువు గట్టు ఆక్రమణపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకొని ఆక్రమణలను తొలగించారు. ఇప్పుడు అంగర గ్రామానికి సంబంధించిన విషయంపై కోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు ఎలా స్పందిస్తారు? ఏమేరకు చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటారు? అన్నదే ఆసక్తికర అంశంగా మారింది.

# 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ




- చిరకాల కోరికకు రూపు
- పలు గ్రామాలకు మెరుగైన విద్యుత్ వసతికి

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 07 :**నియోజకవర్గ అభివృద్ధిలో మరో మైలురాయి నమోదైంది. ప్రత్తిపాడు మండలంలోని పోతులూరు గ్రామం శాంతి ఆశ్రమం సమీపంలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. విద్యుత్ శాఖ (APEPDCL) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాల అమలులోనూ, మౌలిక వసతుల అభివృద్ధిలోనూ ప్రాధాన్యత ఇస్తోంది. పోతులూరు, వాకపల్లి, యు.జె.పురం, వెంకటనగరం, చింతలూరు వంటి పలు గ్రామాల ప్రజలకి మెరుగైన విద్యుత్ సేవలు అందించాలన్న ఆశయం నేడు సాకారమవుతోంది. ఇది ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక," అని అన్నారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల గ్రామాల్లో ఏర్పడుతున్న వోల్టేజ్ సమస్యలు, తరచూ విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. రైతులకు సాగు అవసరాల కోసం విద్యుత్ అందుబాటులోకి రానుండటంతో వ్యవసాయ ఉత్పాదకతలో మెరుగుదల కనిపించనుందన్నారు. అలాగే చిన్న పరిశ్రమలు, విద్యార్థులు, మహిళలు అందరూ దీని ద్వారా లాభపడతారని ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎన్డీయే కూటమి శ్రేణులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానంతరం స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్మశానంలో నీడలేక ఇబ్బందులు - షెడ్డు నిర్మాణానికి ఎమ్మార్వో, ఎంపిడివోకు వినతి పత్రం




**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 7 :**ప్రత్తిపాడు మండలంలోని ప్రతిపాడు గ్రామంలో ఉన్న ప్రగతి కాలేజీ వెనుక ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సమాధి స్థలంలో మౌలిక సదుపాయాల లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మృతుల అంత్యక్రియల సమయంలో వచ్చే ప్రజలకు నీడ లేక, ఎండల్లో నిలబడలేక, వర్షంలో తడవకుండా ఉండలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో, ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు, మండల అభివృద్ధి అధికారికి వినతి పత్రం సమర్పించారు. అందులో స్మశానంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేపట్టాలని, వాటర్ కులాయి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరుగులు చక్రం, స్వర్ణపూడి కోటేశ్వరరావు, మోర నాగేంద్ర, ముప్వల అప్పన్న, సలాది దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత దినోత్సవం సందర్భంగా బీజేపీ నేతల వినూత్న కార్యక్రమం

- చేనేత కార్మికుల చేతిలో నేరుగా వస్త్రాలు కొనుగోలు
- వారిని సత్కరించిన బీజేపీ నాయకులు



**కాజులూరు, పెన్ పవర్, ఆగస్టు 7:**జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజులూరు మండలంలో భారతీయ జనతా పార్టీ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి.కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆదేశాల మేరకు, కాజులూరు మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్య మంతుల శివాజీ నేతృత్వంలో చేనేత కార్మికుల నుంచి నేరుగా వస్త్రాలు కొనుగోలు చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "బీసీలకు మొదటిసారి ప్రధాని హోదాలో ఒక బీసీ నాయకుడు ఉన్నాడు. బీజేపీ ప్రభుత్వం బీసీల తోపాటు చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంది.ఈ రంగాన్ని నిలబె ట్టేందుకు మోదీ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది," అని తెలిపారు.

కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు జక్కా శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షులు నిమ్మన రాజేష్, పోలిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి బండారు సత్య నారాయణ, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పినిపే సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.చేనేత కార్మికులుగా లొల్ల వెంకటరమణ, మొండి వెంకట నాగరాజు, కొండేటి శ్రీను, తాడిచెర్ల అచ్చరావు, గుండారపు శ్రీను, కులపాకుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.ఈ కార్య క్రమం సందర్భంగా కార్మికులు బీజేపీ మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ సత్కరించారు.

## గుంతలు పడ్డ రోడ్లపై ప్రయాణం జరభద్రం...




**ఎటపాక ,పెన్ పవర్, ఆగస్టు 07:**ఎటపాక మండల పరిధిలోని ఎటపాక టు కన్నాయిగూడెం మధ్య ఉన్న జాతీయ రహదారి రోడ్లు పై పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదాలు జరిగే ప్రదేశాలుగా మారాయి, ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో భారీ అధిక బరువుతో ఇసుక లారీలు తిరుగుతున్నాయని,ఇసుక లారీల వల్ల రోడ్లు పై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఈ గోతులు పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు,

## అడ్డతీగల హాస్పిటల్ మరియు ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లి పాల ముగింపు కార్యక్రమం....




**అడ్డతీగల ,పెన్ పవర్ ,ఆగస్ట్07:** ప్రపంచ తల్లిపాలు పట్టే వారం అనేది ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో (01 నుండి 07 వరకు) జరుపుకునే ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం అని హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండ. సతీష్ అన్నారు.అలాగే ఈ వారం మొత్తం, నవజాత శిశువులు మరియు తల్లులకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రాముఖ్యతను, ప్రోత్సహించడంలో వివిధ అంతర్జాతీయ మరియు స్థానిక సంస్థలు చేతులు కలుపుతాయి అని ఎస్. ఆన్. సి. యు. డాక్టర్. షేక్.మస్తాన్ అన్నారు.అలాగే

ప్రపంచ తల్లిపాలు పట్టే వారంను మహిళలు తమ బిడ్డలకు ఎప్పుడైనా మరియు ఎక్కడైనా తల్లిపాలు ఇచ్చే హక్కులను ప్రోత్సహిస్తుంది, సమర్థిస్తుంది మద్దతు ఇస్తుంది అని పీడియాట్రిషన్ డాక్టర్ .శ్రీ హర్ష అన్నారు.అలాగే బిడ్డ పుట్టిన వెంటనే ప్రతి తల్లి ఇచ్చే పాలను మురిపాలు అంటారు, వీటిలో అనేక పోషక విలువలు కలిగి ఉంటాయి, తద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది, కావున తల్లి బిడ్డలకు కచ్చితంగా మురి పాలు ఇవ్వాలి అలాగే పాలు ఇచ్చు ప్రతి తల్లి, బిడ్డ తీసుకో వలసిన జాగ్రత్తలు గురించి హాస్పిటల్ కౌన్సిలర్ నారే.వాసు వివరించారు.

ఈ కార్యక్రమం లో హాస్పిటల్ అనస్థిషియా డాక్టర్ .రచన పిల్లలు శ్వాస తీసుకునే విషయం లో తల్లి ఎప్పుడు బిడ్డను జాగ్రత్త గా చూసుకోవాలి అని, ముఖ్యం గా చేతి వేళ్ళు నోట్లో పెట్టుకోకుండా మరియు బిడ్డ చుట్టూ ప్రక్కల ఎటువంటి ప్రమాదకర వస్తువులు ఉండకుండా చూడాలని చెప్పారు.ఈ కార్యక్రమం లో డాక్టర్. ప్రస్సన దేవి మాట్లాడితు శిశువు జీవితంలో మొదటి కొన్నింటిలో తల్లిపాలు వారి పోషక అవసరాలన్నిటికీ ప్రాథమిక వనరులు ఇందులో 87% నీరు, 7% కార్బోహైడ్రేట్, 4% లిపిడ్ మరియు 1% ప్రోటీన్, విటమిన్లు మరియు ఇతర ఇతర ఖనిజాలు (కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, మొదలైనవి). తల్లి మరియు బిడ్డ ఇద్దరి ప్రయోజనాలతో కూడిన తగిన తల్లిపాలు, ఇందులో పిల్లలకు తీవ్రమైన వ్యాధులు (స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక వ్యాధులు) నివారించడం లో తల్లిపాలు ముఖ్య భూమిక పోషిస్తుందని అని అన్నారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ సిబ్బంది నాగమణి,సునీత,శేషరత్నం, మంజుల, జానికి, విజయ, రామకృష్ణ,దేవుడు ఊహ,వసుంధర,రాజేశ్వరి, లలిత, హెప్సిబా, శ్రీకాంత్, దేవుడు,అమ్మాజీ,తదితరులు పాల్గొన్నారు. అలాగే అడ్డతీగల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సెక్టార్లో తల్లిపాలు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గర్భవతులకు శ్రీమంతాలు చేశారు.అలాగే చంటి బిడ్డలకు అన్నప్రాసన చేశారు, తల్లి బిడ్డకు పాలిచ్చే విధానం పై డాక్టర్. ఎస్తేరు రాణి, సిడిపిఓ పి .క్రాంతి కుమారి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి వర్కర్లు, గర్భిణీ స్త్రీలు ,బాలింతలు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,ఆగస్టు 7 :** ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని రాచన్నగూడెం పిహెచ్సి వైద్యాధికారి సిహెచ్ చైతన్య అనిల్ కుమార్ సూచించారు. గురువారం రాచన్నగూడెం పిహెచ్సిలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జ్వరాలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గ్రామాలలో స్ప్రేయింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, స్లీపర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని అన్నారు. సమస్యాత్మక గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఎవరికైనా జ్వరాలు వస్తే వైద్య సిబ్బంది సంప్రదించి ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలని సూచించారు.

## విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 7:**విద్యార్థులు కేవలం పాఠశాల విద్య మాత్రమే కాదు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (టెక్నికల్ స్కిల్స్)తో పాటు సాఫ్ట్ స్కిల్స్పై కూడా అవగాహన పెంచుకోవాలని రిటైర్డ్ ఆర్మీ మేజర్ జనరల్, రామయ్య యూనివర్సిటీ డైరెక్టర్ (సిఎన్ఎస్ఎస్) జె.వి. ప్రసాద్ సూచించారు. గురువారం కాకినాడలోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్స్ ప్రాంగణంలో జరుగుతున్న సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు.ఈ శిక్షణా కార్యక్రమం స్కిల్లింక్, క్రియో, గెయిన్ సంస్థల భాగస్వామ్యంతో, సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మెంటర్ బీవీ నాయుడు పర్యవేక్షణలో నిర్వహించబడుతోంది. మేజర్ జె.వి. ప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వెంకట్రావ్ ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాల్లో సాఫ్ట్ స్కిల్స్ ఎంతో కీలకంగా మారాయి. ప్రతీ విద్యార్థి వాటిపై దృష్టి పెట్టాలి. నైపుణ్యాలు కలిగి ఉన్న యువతకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి," అని పేర్కొన్నారు.అలాగే, యువత ఉపాధికి అవసరమైన శిక్షణ అందించడంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. రాష్ట్ర రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆధ్వర్యంలో ఇలాంటి శిక్షణ కార్యక్ర మాలు మరిన్ని యువతకు ఉపయోగప డేలా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్ర మంలో సంతోష్ కుమార్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో పథకాలు గల్లంతయ్యాయి

- వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లు బోయిన శ్రీను




**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 7:** మున్సిపాలిటీ 22, 23, 24 25 వార్డుల్లో "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. "కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఒక్క పథకం కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు,ఉచిత బస్సు ప్రయాణం,నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, సూపర్ సిక్స్ – సూపర్ సెవెన్ వంటి హామీలన్నీ మాయమయ్యాయి,ప్రజలే స్వయంగా మాకు ఏదీ అందలేదని అంటున్నారు. జగన్ పాలనలో అందిన పథకాలు ఇప్పుడు గల్లంతయ్యాయి,అని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు,మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు,మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు 09 ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చెయ్యండి..




**ఎటపాక, పెన్ పవర్, ఆగస్టు 07:**ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ గిరిజన నివాస ప్రాంతంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు – 9న కూనవరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం జెండా ఆవిష్కరణను గిరిజన సంఘం నాయకులు నక్క సూరిబాబు గురువారం ఎగురవేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆటపాటలతోటి, డోలు, రేలా అడుగుల తోటి, గిరిజన సంప్రదాయ నృత్యాలతోటి, కూనవరంలో మన గిరిజన పండుగ జరుగుతుందని, మన పండుగకు మనమంతా పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఐ.వి. స్థానిక గిరిజన నాయకులు ఉయికే వెంకన్న, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సామర్లకోటలో ముగ్గురి హత్య వెనుక అక్రమ సంబంధమే కారణం

- ములపార్తి మాధురి, ఆమె ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన నిందితుడు సురేష్ అరెస్ట్
- జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 7:**సామర్లకోటలో ములపార్తి మాధురి, ఆమె ఇద్దరు కుమార్తెల దారుణ హత్య కేసును జిల్లా పోలీసు శాఖ త్వరితంగా ఛేదించింది. ఈ ముగ్గురి హత్యకు ప్రధాన కారణం అక్రమ సంబంధమేనని, నిందితుడిగా తలే సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ రాత్రి సామర్లకోట సీతారామ కాలనీలో ఈ హత్యలు జరిగాయి. మాధురి మరియు నిందితుడు సురేష్ మధ్య గత రెండేళ్లుగా అక్రమ సంబంధం కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. మాధురి ఆర్థిక అవసరాల కోసం సురేష్ ఇప్పటికే సుమారు రూ.7 లక్షల వరకు ఖర్చు చేశాడని దర్యాప్తులో వెల్లడైంది. నింది తుడి భార్య, మాధురి నుండి వస్తున్న ఒత్తిడిని భరించలేక హత్య పథకం వేశాడని ఎస్పీ చెప్పారు. హత్య జరిగిన రోజు రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో మాధురి పిలుపుతో ఆమె ఇంటికి వెళ్లిన సురేష్, భోజనం చేసిన అనంతరం శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం జరిగిన గొడవలో కోపోద్రిక్తుడై తనతో తీసుకెళ్లిన దుడ్డుకఱ్ఱతో మాధురిని తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ఆ అరుపులకు నిద్రలేచిన మాధురి కుమార్తెలు నిస్సి, ట్రైనీని కూడా అదే విధంగా కొట్టి హతమార్చినట్లు విచారణలో వెల్లడైంది. తరువాత ఇంట్లో ఉన్న రూ.2.50 లక్షల నగదు, విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకొని పరారయ్యాడు. కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, సామర్లకోట సీఐ ఎ. కృష్ణ భగవాన్, క్రైమ్ సీఐ ఆర్. అంక బాబు మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు. ఈ క్రూరమైన ఘటన సామాజికంగా కలకలం రేపింది. పోలీసులు సమయానుకూలంగా స్పందించి నిందితుడిని పట్టుకోవడం ప్రశంసనీయం.

# డాక్టర్ నాగేశ్వర రెడ్డి తో స్టాలిన్ బాబు మర్యాద పూర్వక భేటీ



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు7:** ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్ (ఏఐజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తో వైఎస్ఆర్సిపి నేత నేలపూడి స్టాలిన్ బాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులుగా ప్రపంచం లోనే భారత కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసే విధంగా నూతన ఆవిష్కరణలు చేస్తున్న నాగేశ్వర్ రెడ్డి సేవలను ప్రస్తుతించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారానికి నాగేశ్వర్ రెడ్డి పేరును ప్రతిపాదించడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ బాబు తన రచన సంజీవయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయనకు అందజేశారు.

# బీసీలపై దాడులను ఖండించిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 7** :కడప ఎన్నికల సమయంలో బీసీ కులానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పై కూటమి నేతలు దాడికి పాల్పడటం దురదృష్టకరమని వైసిపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు..

వైసిపి పార్టీని అనగద్రొక్కాలని ధోరణిలో టిడిపి బిజెపి జనసేన నాయకులు చూస్తుంటే. వైసిపి కార్యకర్తలు ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారని అన్నారు..

వైసిపి పార్టీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక తమపై కేసులు పెడుతున్నారని అన్నారు..

కేసులకు భయపడే ప్రసక్తే లేదని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

# నారా వారి రెడ్ బుక్ రాజ్యాంగం,రాష్ట్రంలో పరిపాలన





- వి.ఆర్.పురం వై.సి.పి.మండల నాయకులు కార్యకర్తలు
- కూనవరం వై.సి.పి.మండల నాయకులు కార్యకర్తలు

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.7:**వి.ఆర్.పురం,కూనవరం వై.సి.పి.మండల నాయకులు టేకులబోరు అంబేద్కర్,విగ్రహం వద్ద గురువారం ఎం.పి.పి.పాయం రంగమ్మ అధ్యక్షతనలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బి.సి.సెల్ అధ్యక్షులు ఆవుల మరియాదాస్,వి.ఆర్.పురం వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కడపజిల్లా పులివెందుల నియోజకవర్గంలో జడ్పీటీసీ గా పోటీ చేసిన అభ్యర్థి కు ప్రచారానికి వెళ్లిన బి.సి.సెల్ రాష్ట్ర కార్యదర్శి ,ఎం.ఎల్.సి. ఆర్.రమేష్ యాదవ్,బి.సి.సెల్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల రమేష్,పై టిడిపి రౌడీలు దాడి చేయడం చాలా బాదాకరం అంటూ తీవ్రంగా మండిపడ్డారు. ఓటమి భయం తోనే టిడిపి రౌడీలు దాడికి దిగజారుతున్నారని,ఆరోపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంను తుంగలో తొక్కి రాష్ట్రంలో రాక్షసి,పాలన,నారా వారి రెడ్ బుక్ రాజ్యాంగం, రాజ్యం పాలన చేస్తుందని,విమర్శించారు. టిడిపి ఆటలు ఇంకా ఎన్నలో సాగవని,రాష్ట్రంలో ఉన్న ప్రజలు టిడిపి అరాచకాలు అన్ని గమనిస్తున్నారని,రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వై.సి.పి.అభ్యర్థులను భారీ మెజారితో గెలిపించి,టిడిపి పార్టీ ను ఓడించి,తగిన బుద్ధి చెప్పు తారని,అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన బెట్టి ప్రజల మనస్సును ప్రక్కకు మళ్లించటానికి దిగజారు డు రాజకీయాలు చేస్తున్నారని,ఆరోపించారు. అనంతరం అంబేద్కర్,విగ్రహం వద్ద వినతి పత్రం పెట్టి ఈ రాష్ట్రాన్ని పరిపాలన చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబా బుకు మంచి బుద్ధి ప్రసాదించాలని,రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి అంబేద్కర్,రచించిన రాజ్యాంగాన్ని అనుసరిం చాలని,వినతి పత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఐ.విభాగం అధ్యక్షులు బి.సి.సెల్ సీనియర్ నాయకులు బొడ్డు సత్యనారాయణ,జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ,చిన్నమట్ట పల్లి సర్పంచ్,పిట్టా రామారావు,మండల నాయకులు పిసా కమిటి అధ్యక్షులు కోటం జయరాజు బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు,యాదవ సంఘం మండల అధ్యక్షులు మోడెం నరేష్,కూనవరంవై.సి.పి.మండల కన్వీనర్ ఆలూరి కోటయ్య,మాజీ జడ్పీటీసీ ఆరవ వెంకటరామారావు,ఇంటి పూర్ణయ్య,యూత్ నాయకులు బత్తుల వెంకటేష్,డీకొండ గంగాధర్,సొంది పాపారావు,కూనవరం సర్పంచ్,లు ఎం.పీ.టీ.సీ.లు వై.సి.పి.నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పబ్బం గడుపుకోవడానికి అవాకులు, చవాకులు పేలితే సహించం

## వైసీపీ జగ్గంపేట మండల ఉపాధ్యక్షుడు వానాసి సుబ్రహ్మణ్యం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 7 :** మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ తోట నరసింహంపై అవాకులు చవాకులు పేలితే సహించబోమని వైసీపీ జగ్గంపేట మండల ఉపాధ్యక్షుడు వానాసి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం జగ్గంపేట వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత రెండు రోజుల క్రితం జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వగృహంలో నిర్వహించిన జక్కంపూడి రామ్మోహనరావు జయంతి కార్యక్రమంలో వైసీపీ నాయకుడు అత్తులూరి సాయిబాబు చేసిన వ్యాఖ్యలకు వానాసి సుబ్రహ్మణ్యం మీడియా ముఖంగా కౌంటర్ ఇచ్చారు. అత్తులూరి సాయిబాబాకు గుర్తింపు ఇచ్చిన వ్యక్తి మాజీమంత్రి, జగ్గంపేట వైసీపీ ఇన్చార్జి తోట నరసింహం అన్నారు. ఏదైనా స్థాయిని బట్టి మాట్లాడాలని ఆయన్ను విమర్శించే స్థాయి నీది కాదన్నారు. ఎక్కడో మారు మూల గ్రామంలో ఉన్న నిన్ను జిల్లా, రాష్ట్ర స్థాయిలో పదవులు కట్టబెట్టారని అది తోట నరసింహం దయ అన్నారు. నీకు ఇరిగేషన్ అప్పగిస్తే నువ్వు రాజభవనం కట్టుకున్నావు అది నీసొంత నిధులతో కట్టుకుంటే మీ నాన్న పేరు ఎందుకు పెట్టుకోలేదని ప్రశ్నించారు. కార్యకర్తలను గుర్తించలేదని మాట్లాడుతున్నావని అలా అంటే నువ్వు పీసీసీ నెంబర్ ఎలా చేశావని అడిగారు. జక్కంపూడి రామ్మోహనరావు, తోట నరసింహంది మంచి స్నేహ బంధమని 2004లో నరసింహంకు సీటు ఇచ్చింది రామ్మోహనరావు అని అప్పుడు నేను పక్కనే ఉన్నానని నువ్వు ఎక్కడ ఉన్నావన్నారు. నువ్వు గొప్పలు చెప్పుకోవడానికి పార్టీ మారి, పబ్బాలు గడుపుకోవడానికి పార్టీలో ఉండి కూడా నమ్మక ద్రోహం చేశావని విమర్శించారు. రెండు నాలుకల ధోరణితో మాట్లాడడం కరెక్టు కాదన్నారు. తోట నరసింహం నియోజకవర్గానికి ఏం చేయలేదని చెప్పడానికి సరిపోవన్నారు. నువ్వు మాట్లాడే మాటలకు తగిన మూల్యం చెల్లించుకుంటావని అసలు నీ సొంత గ్రామం మల్లిశాలలో నువ్వు ఎంత మందికి తెలుసునని సూటిగా ప్రశ్నించారు. క్రింది స్థాయి కార్యకర్తను గుర్తించలేని వ్యక్తిత్వం నీదని సాయిబాబును తీవ్రంగా విమర్శించారు. మళ్లీ నరసింహం కోసం ఎక్కడైనా మాట్లాడితే నీ చరిత్ర బయట పెట్టడం జరుగుతుందని అత్తులూరి సాయిబాబును ఉద్దేశించి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు.

# ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ని ఫోన్లో హెచ్చరించిన పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 7:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. స్థాయి మరిచి విమర్శలు చేస్తున్నావ్, నీకు తగదని ఇజ్రాయిల్ ను ఫోన్లో తీవ్రంగా హెచ్చరించారు. దేశ ప్రధానమంత్రి మోడీచే ప్రశంసలు అందుకున్న పవన్ కళ్యాణ్ నా నీవు విమర్శించేదని మండిపడ్డారు. ఈ రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో కీలక భూమిక పోషిస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామిగా ఉన్న నీతి,నిజాయితీ గల పవన్ కళ్యాణ్ ని మరొక్కసారి నీవు గాని, నీ వైసీపీ నాయకులు గాని విమర్శిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు..

# ప్లాస్టిక్ జెండా వద్దు - పేపర్ జెండా ముద్దు





**ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి, పర్యావరణాన్ని కాపాడాలి.**

**ఆత్రేయపురం,పెన్ పవర్ ఆగస్టు 7:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రధాన ఫౌండేషన్ పాఠశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తూ ఒక వినూత్న కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ నేతృత్వంలో 1, 2 తరగతులలో చదువుతున్న 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. "ప్లాస్టిక్ జెండా వద్దు – పేపర్ జెండా ముద్దు" అనే నినాదంతో, వారు స్వయంగా 79 పేపర్ జెండాలను తయారుచేశారు. ఈ జెండాలు ప్రత్యేకంగా 7.9 సెంటీమీటర్ నుండి 7.9 అంగుళాల వరకు ఉండే విధంగా రూపొందించబడ్డాయి. అంతేగాక, ఈ పేపర్ జెండాలను వారు కేవలం 79 నిమిషాల్లో సిద్ధం చేశారు.

తర్వాత ఈ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు పేపర్ జెండాలను అందిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి, పర్యావరణాన్ని కాపాడాలి అనే సందేశాన్ని చైతన్యవంతంగా ప్రచారం చేశారు. చిన్నారుల చొరవకు గ్రామస్థులు అభినందనలు తెలుపుతూ, ఈ అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఎంతో ప్రశంసించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ, "ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యతా భావాన్ని పెంపొందిస్తాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలి"అన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

డిఆర్వో మాధవి



**అమలాపురం వెన్ పవర్ ఆగస్టు 7:** తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మొదటి టీకా గా రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని డిఆర్ఓ కే.మాధవి తెలిపారు. ప్రపం చ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆఖరి రోజైన గురువారం స్థానిక కలెక్టరేట్ నుండి నల్ల వంతెన వరకు నిర్వ హిం చిన తల్లిపాల వారో త్సవ ర్యాలీని డిఆర్ఓ కే మాధవి కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని అన్నారు పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని సూచించారు తల్లిపాల ప్రాముఖ్యతను, ప్రతి ఒక్కరు గుర్తించి తల్లిపాల సంస్కృతిని కొనసాగించేలా ప్రోత్సహించాలన్నారు తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసు కుని ఆ దిశగా ఈ వారోత్స వాలలో ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. తల్లి పాల ద్వారాపిల్లలకు రాగ నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ ,,సి హెచ్ వి భరత్ లక్ష్మి, ఐసిడిఎస్ పిడి శాంతి కుమారి అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొన్న కంబాల

- బోనాలు ఎత్తుకున్న 300 మంది మహిళలకు కంబాల ఉచితంగా పట్టు చీరలు పంపిణీ
- బోనాలు కార్యక్రమానికి 50,000 వేలు రూపాయలు విరాళం





**గోకవరం, పెన్ పవర్,ఆగస్టు 07:** గోకవరం మండలం పెంటపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన మాతృశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్తులు, మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గజామాలతో సత్కరించి, మెమొంటో అందజేశారు. తొలిత గ్రామంలోని వేగులమ్మ అమ్మవారిని దర్శించుకుని, మహిళలతో కలిసి బోనాలు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద అందజేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు ఎత్తుకున్న 300 మంది మహిళలకు పట్టు చీరలు ఉచితంగా పంపిణీ చేశారు. బోనాలు కార్యక్రమానికి 50 వేల రూపాయలు విరాళం అందజేశారు. అలాగే ఆదివారం నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమానికి 300 కిలోల బియ్యం, 300 కిలోల చికెన్ విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆడపడుచుకు పట్టు చీర అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, ఎంపీటీసీ సభ్యులు గండికోట రామకృష్ణ, ఆలయ ధర్మకర్త ఎన్. నాగన్న, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ వెంకటరామ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వేగూరి రామకృష్ణ, పాలరాజు, కొండ ముసలయ్య, కాకర దుర్గారావు, ధార శ్రీను, నందూరి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి మహోత్సవాలు ప్రారంభించిన పి గన్నవరం ఎమ్మెల్యే







**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 7 :**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం శ్రీ సిద్ధి వినాయక ఆలయ ఆవరణంలో వినాయక చవితి,మహోత్సవములు-2025 సందర్భముగా, ఆగస్టు 07 గురువారం ఉదయం 7:56 గంటలకు ఉత్సవ అంకురార్పణ (పందిరి రాట ముహూర్తం) శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా జరిగింది.

ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవ ఆహ్వాన పత్రికను శాసన సభ్యులు ఆవిష్కరించారు.,భక్తుల కొరకు ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించబడింది.గురువారం నుంచి అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు అందజేయబడతాయని తెలిపారు.ఈ పవిత్ర కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం.

- ఐసిడిఎస్ సిడిపిఓ, ఎం పూర్ణిమ.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 7:** తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని జగ్గంపేట ఐసిడిఎస్ ,సిడిపిఓ, ఎం పూర్ణిమ అన్నారు. గురువారం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో బీసీ కాలనీ రామాలయ వద్ద గల అంగన్వాడి కేంద్రంలో చిల్లంగి సెక్టార్ సూపర్వైజర్ బూసమ్మ ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు.తొలుత గ్రామంలో భారీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ తల్లిపాలు శిశువు ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు మురుపాలు అందించాలని అప్పుడే శిశు మరణాలు తగ్గుతాయన్నారు.తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ స్థూల కాయం వంటి వ్యాధులు నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సాధన, మహిళా పోలీస్,ఏఎన్ఎమ్, ఆశావర్కర్లు,అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏజెన్సీ గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత





**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 7:** ఏజెన్సీ గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

దీనిలో భాగంగా నీతి అయోగ్ కార్యక్రమానికి గురువారం న్యూఢిల్లీలో హాజరవ్వడం జరిగిందని అన్నారు. విద్య,వైద్యం, రహదారులు, త్రాగునీరు, నివాసాల కోసం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో జరిగే నీతి అయోగ్ గురువారం న్యూఢిల్లీ లో జరిగే కార్యక్రమానికి వై.రామవరం మండలం నుండి హాజరు కావడం జరిగిందని ఎంపీడీవో బాబు నగర్ తెలిపారు.

# ఆదివాసి దినోత్సవానికి సిబి ఆర్ ట్రస్ట్ నుండి రెండు లక్షలు విరాళం





**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 7:** ఆగస్టు 9న జరగనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమాల నిర్వహణకు సిబిఆర్ ట్రస్ట్ చైర్మన్, పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు రెండు లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. గురువారం ఐటీడీఏ కేఆర్ పురం లో అధికారులతో పాటు ఆదివాసి సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆదివాసులకు విద్య, వైద్యం, జీవనోపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ఈ దినోత్సవం వారి గౌరవానికి గుర్తుగా ఉండాలని అన్నారు. ఆదివాసుల సంస్కృతి విలువలను నిలబెట్టాలంటే సామూహికంగా కృషి చేయాలని సూచించారు. 2 లక్షల రూపాయల చెక్కును కేఆర్ పురం ఐటిడిఏ పిఓ కె రాములు నాయక్ కి ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ఎమ్మెల్యే సిరి బాలరాజు కి కృతజ్ఞతలు తెలిపారు.

# చిన్నపాటి చెరువుగా మారిన రోడ్డు



సామాజిక వేత్త గుండె పాండురంగ

**టి. నర్సాపురం, పెన్ పవర్,ఆగస్టు 7 :** బొర్రంపాలెం గ్రామంలో కొత్త పేట నుండి జగన్ అన్న కాలనీకి (మత్స్యకారుల ఇళ్లకు) వెళ్ళే మట్టి దారి చినుకు పడితేనే చింద్రంగా మారడమే కాకుండా చిన్నపాటి చెరువులను తలపిస్తుందనీ బొర్రంపాలెం గ్రామ సామాజి కార్యకర్త గుండె పాండురంగ అన్నారు.ఈ రోడ్ ఎం డి ఓ అధికారి నుండి డీ పీ ఓ అనురాధ వరకు రోడ్ దుస్థితి వారికి నేను గతంలోనే తెలపడం జరిగిందనీ ఈ దారికి కంకరు మట్టిని పోస్తామని నెలలు గడుపుతున్నారు.సూరంపూడి రోడ్ పోసేటప్పుడు ఇదికూడా పోస్తామని చెప్పి నెలరోజులు కావస్తుంది.సూరంపూడి రోడ్ సీ ఐ పొలం నుండి ఆంజనేయుడు గుడి వరకు మళ్ళీ సూరంపూడి దగ్గర లో కొద్దిగా పోసి సుమారు రెండు లక్షల రూపాయలు వరకు బిల్లులు తయారు చేశారని ప్రజలు అనుకుంటూ ఉన్నారు.మేము ఎంత బిల్లులు పెట్టారని అడగం. ప్రజలకు పనులు చేయమని అడుగుతున్నాం అన్నారు.

ఈ రోడ్ మార్గన నిత్యం మత్స్యకారులు, స్కూల్ పిల్లలు, పొలాలకు వెళ్ళే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ.... సత్వరమే రోడ్ కి కంకర మట్టిని తోలి ప్రజలకు గోతులు,బురద నుండి ఉపశమనం కలిగించాలని పంచాయతీ కార్యదర్శి వారిని గుండె పాండురంగ కోరారు.

# సౌండ్ సిస్టం బహుకరణ



**టీ నర్సాపురం, పెన్ పవర్, ఆగస్టు 7:** బండి వారి గూడెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఝూపల్లి శేషగిరి రావు మరియు దాసరి రాంబాబు సుమారు 20 వేల రూపాయలతో సౌండ్ సిస్టంను బహుకరించారు. ఈ సందర్భంగాశేషగిరి రావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఎదిగి ఒదిగి ఉండాలని మీరంతా పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. దాసరి రాంబాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ సౌండ్ సిస్టం బహుకరించిన దాతలకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, దాతలకు సాలువలతో సన్మానించారు.

# వృద్ధులకు అన్నదానం చేసిన దంపతులు



**గోపాలపురం, పెన్ పవర్, ఆగస్టు 7.** నియోజకవర్గంలోని దేవరపల్లి మండలం అచ్చయ్య పాలెం గ్రామానికి చెందిన చింతలపూడి మేరీ వినోద్ దంపతులు వృద్ధులకు అన్న వితరణ కార్యక్రమం గురువారం చేపట్టారు. గోపాలపురం, దేవరపల్లి గ్రామాల మధ్యన ఉన్న భారతి వికలాంగుల సేవా సమితి వద్ద ఉన్న వృద్ధులు, వికలాంగులకు మేరీ పితృమూర్తి వెంకటేష్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆ దంపతులు తెలిపారు. వారు దగ్గరుండి తమ స్వహస్తాలతో వారికి అన్న పానీయాలు వడ్డించారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కాగిత భాస్కరరావు మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వృద్ధులకు వికలాంగులకు అటువంటి అన్నాన్ని దానం చేస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి శ్రీదేవి దుర్గారావు దంపతులు, చింతలపూడి ఝాన్సీ, షైనీ, మౌనిక, సునీత తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజామన్ననలు

-టిడిపి మండల అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 7:** ఏ ఉద్యోగి అయినా వీధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజామన్ననలు పొందుతారని మండల టిడిపి అధ్యక్షుడు, భూపాలపట్నం గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు అన్నారు. గురువారం గత ఐదు సంవత్సరాలుగా వివిధ శాఖల్లో పనిచేసే ఇటీవల బదలీపై వెళ్లిన గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలు గ్రామపంచాయతీ, సచివాలయంలో పని చేసి ఇతర మండలాలకు వెళ్లి న సెక్రెటరీ, పాఠశాల ఉపాధ్యాయులు,సచివాలయ సిబ్బంది, పలువురు ఉద్యోగులను ఘనంగా సన్మానం చేశారు. సర్పంచ్తోపాటు వార్డ్ మెంబర్లు ఉద్యోగులను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి,నూతన వస్త్రాలు అందించారు.

# జానపద గీతాలతో ప్రజలకు అవగాహన సదస్సు

-వైద్య శాల డాక్టర్లు,రోజా రమణి,నీరజన్,కుమార్,





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.7:**చింతూరు ఐ.టీ.డీ.ఏ.పి.ఓ.ఆదేశాల మేరకు డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ.పుల్లయ్య చూచనలు మేరకు జీడిగుప్ప ప్రభుత్వ వైద్య శాల డాక్టర్లు,రోజా రమణి,నీరజన్,కుమార్, వైద్యశాల హెల్త్ సిబ్బంది.ఆద్వర్యంలో రాజమహేంద్రవ రం వి.ఎస్.ఆర్.కళా జాతర కళాకారుల జానపద గీతాల తో గురువారం శ్రీరామగిరి,మ్నెదులగూడెం,రాజుపేట తది తర గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.అవగాహన సదస్సులో బాగంగా డెంగ్యూ,మలే రియా,డయేరియా,సికిల్,సెల్,ఎనీమియా,పరిసరాల పరి శు భ్రత,దోమతెరలు గురించి,గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారుఈ కార్యక్రమంలో హెచ్.వి.పున్నమ్మ హెల్త్ అసిస్టెంట్,రామారావు,ఎ.ఎన్.ఎం.భూబమ్మ,ఆశాలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం గ్రామంలో నూతన ఉద్యానవనానికి ఎమ్మెల్యే ప్రారంభోత్సవం





**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 07 :** మండలంలోని ధర్మవరం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన నూతన ఉద్యానవనాన్ని స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ "గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా ఈ ఉద్యానవనం ఏర్పాటు చేయడం జరిగింది. ఇది పిల్లలకు ఆటస్థలం, మహిళలకు వాకింగ్ మార్గం, వృద్ధులకు విశ్రాంతికేంద్రంగా నిలుస్తుంది," అన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు విశ్రాంతికి అనువుగా, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే ఉద్దేశంతో ఈ పార్క్ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక యువత, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి క్రీడలలో మెడల్స్ సాధించిన దివ్యాంగులకు మంత్రి సుభాష్ ప్రశంసలు



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 7:** జాతీయస్థాయి క్రీడలలో అద్వితీయ ప్రతిభ కనబరిచి మెడల్స్ గెలుచుకున్న ఇద్దరు దివ్యాంగులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రశంసించారు. రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం కాజులూరు గ్రామంకు చెందిన కొల్లు సత్య దుర్గా ప్రొలరాజు ప్రత్యేక ఒలింపిక్ జాతీయస్థాయి బోసి గేమ్ లో ద్వితీయ స్థానం, వ్యక్తిగత విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. అలాగే వాలీబాల్ పోటీల్లో పెమ్మనబోయిన జీవన్ కుమార్ తృతీయ స్థానం సాధించి రామచంద్రపురం నియోజవర్గానికి, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు సాధించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన భవిత పాఠశాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎం జయ ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ ను తాము సాధించిన మెడల్స్ తో ఆదివారపు పేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఇరువురు క్రీడాకారులతో పాటు, వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కోచ్ ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్, క్రీడాకారులు మంత్రి సుభాష్ తో మాట్లాడుతూ మీరిచ్చిన ఆర్థిక సహాయం, ప్రోత్సాహంతోనే ప్రత్యేక ఒలంపిక్స్ లో పతకాలు సాధించామని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పలువురు కూటమి పార్టీ నాయకులు క్రీడాకారుల ప్రతిభను అభినందించారు.

# లారీలు ఢీకొనివ్యక్తి మృతి



**గోపాలపురం, పెన్ పవర్, ఆగస్టు 7.** గొల్లగూడెం గ్రామ శివారులో చెరువు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. దేవరపల్లి వైపు నుండి గోపాలపురం వైపుకు వస్తున్న లారీ జంగారెడ్డిగూడెం వైపు నుండి దేవరపల్లి వైపు వస్తున్న లారీ ఎదురెదురుగా వచ్చి ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఒక వ్యక్తి ఎగిరి క్రింద పడడంతో తల, కాళ్లు, చేతులు తెగిపడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదం కారణంగా రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మరో రెండు స్తంభాల విరిగిపడ్డాయి. దీనితో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరం ఏర్పడింది. అసలే ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకున్న సమయంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ఉప ఎన్నికల ప్రచారంలో దాడి చేసిన వారిని శిక్షించాలి

- దాడిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు వినతి



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 7.** పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల్లో వైసీపీ నాయకులు ప్రచార అనంతరం బీసీ రాష్ట్ర నాయకులు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ను తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డగించి చెయ్యి విరగగొట్టడం చాలా దారుణమని,వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల రాము కారు అద్దాలను రాడ్లతో పగలగొట్టి,తలపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మర్యాద దాసు అన్నారు. టేకులబోరు సెంటర్ నందు ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మర్యాద దాసు ఆధ్వర్యంలో కూనవరం,విఆర్ పురం మండలాల బీసీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ శాంతియుతంగా ఉప ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వారిపై దాడులకు పాల్పడడం సమంజసం కాదని ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల సమరంలో విజేతలు ఎవరో ప్రజలే తీర్పు ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ ఆలూరి కోటయ్య,ఎంపీపీ పాయం రంగమ్మ,వీఆర్ పురం వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,బొడ్డు సత్యనారాయణ,చిక్కాల బాలు, దీకొండ గంగాధర్,అరవ వెంకట రామారావు,గుజ్జ బాబు,నోముల కొండలరావు,అరవా దివాకర్, సర్పంచులు కారం పార్వతి, తెల్లం నిరోషా,మండల నాయకులు కొమ్మాని సునీత,సోందే పాపారావు, బత్తుల వెంకటేష్,చిలకం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి శ్రీ చందన వెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తుల రద్దీ





- వకుళమాత అన్నదాన భవనానికి విరాళాలు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 7:** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ చందన వెంకటేశ్వర స్వామి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. గురువారం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.
ఈ సందర్భంగా ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి కొందరు భక్తులు గురు వారం ఉదారంగా విరాళాలు అందజేశారు. రావులపాలెం గ్రామానికి చెందిన మల్లిడి నాగ వెంకట ఫణి కుమార్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 27,000 విరాళం అందజేశారు. అలాగే కాకినాడకు చెందిన వెల్బూరు మురళి సురేష్, భువనేశ్వరి దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ. 1,50,116 రూ, విరాళం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించగా, ఆలయ ఉప కమిషనర్ ఎన్.ఎస్. చక్రధరరావు స్వామివారి చిత్రపటానికి సమర్పించారు. భక్తుల సాహాయంతో వేగంగా ముందుకు సాగుతున్న అన్నదాన భవన నిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు మరింత సౌకర్యంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సేవకు నిబద్ధంగా ఉన్న అర్చక మండలి, దేవస్థానం అధికారులు భక్తులను అభినందించారు.

# నూతన సి.హెచ్.సిలో వైద్య సేవలు ప్రారంభం





**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 7:** గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలో నూతనంగా నిర్మించిన జగ్గంపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా ఆస్పత్రికి చేరుకున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పాండ్రంగి రాంబాబు, సభ్యులు బొడ్డేటి సుమన్, నకిరేడ్డి సూర్యవతి, సూపరింటెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలో ఆన్ లైన్ ఓపి తీసుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులు, నర్సులు సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆసుపత్రికి ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని ఇంకా ఎక్కడైనా ఇబ్బంది ఉంటే వాటిపైన దృష్టి పెట్టి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలని అన్నారు. అన్ని రకాల ఆధునిక పరికరాలతో ఇక్కడ వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జగ్గంపేటకు దూరంగా హాస్పటల్ ఉందని ఒక విలేఖరి ప్రశ్నించగా హాస్పటల్ ఇటువంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటే రోగులు తొందరగా కోలుకుంటారన్నారు. జగ్గంపేట నుండి తొందర్లోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పాండ్రంగి రాంబాబు వాహనాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా ఆసుపత్రికి రోగులను తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆటోలను కూడా తక్కువ చార్జీతో రోగులను ఇక్కడకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, గండేపల్లి, జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# భారత చేనేత వస్త్ర పరిశ్రమ ప్రపంచ ఖ్యాతి గడిచింది.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 7:** భారత చేనేత వస్త్ర పరిశ్రమ ప్రపంచ ఖ్యాతి గడించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో వేడుకలు గురువారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహింపబడిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం యొక్క ప్రాధాన్యతను వివరించారు. భారత స్వాతంత్ర్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత వస్త్ర పరిశ్రమ అన్నారు. చేనేత రంగం ప్రాచీన వారసత్వంగా మనకు వస్తుందని, పోచంపల్లి, బనారస్, వెంకటగిరి, గద్వాలు,జందాని, కాంచీపురం, ధర్మవరం, ఉప్పాడ వంటి ప్రాంతాలు చేనేత వస్త్రాలకు పేరుగాంచిన ప్రాంతాలని, మన దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో జీవనోపాధికి ముఖ్యమైన వనరుగా నిలిచిందన్నారు. అత్యధిక మహిళా జనాభా ఈ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇది మహిళా సాధికారతను నేరుగా ప్రస్తావించే రంగం, మొత్తం నేత కార్మికులు , అనుబంధ కార్మికులలో 70% కంటే ఎక్కువ మంది మహిళలురన్నారు. మన చేనేత కార్మికులు నేసే వస్త్రాలు ఖండాంతర ఖ్యాతిని సంపాదించాయని అన్నారు. 2018 సంవత్సరంలో తెలంగాణలో తయారు చేసిన జాతీయ జెండాను ఒక్క కుట్టుకూడా లేకుండా అశోక స్తంభం లో ఉండే 24 పోచాలు కూడా కుట్టులేకుండా మగ్గం తోను అదే విదంగా అగ్గిపెట్టెలో ఇమిడిపోయే చీరను తయారు చేసే సామర్థ్యం ఉండే కళాకారులు చేనేత కార్మికులన్నారు. నేడు వారు అంతా సంతోషంగా జీవితాలు గడపడం లేదని దీనికి కారణం పవర్ లూమ్ ఉంటే అత్యాధునిక యంత్రాలు రంగ ప్రవేశం చేయడంతో వారికి ఉపాధి కష్టతరమైందన్నారు. చేనేత కార్మికుల నైపున్యాన్నిగౌరవించి వారికి ఛేదోడు గా ఉండాలని విద్యార్థులకు తెలియ పరిచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ మాట్లాడుతూ చేనేత కూటుంబాలకు సరైనా ఆదరణ లేక గ్రామీణ ప్రాంతాల నుండి వలస పోయి బ్రతుకు తున్నారని మనవంతుగా చేనేత వస్త్రాలు దరించి కొంత ఆసరాగా నిలుద్దామని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కన్వీనర్ వీరభద్ర రావు, సభ్యులు, డా. శివ ప్రసాద్, లక్ష్మి కుమారి మేరీ రోజలీనా, పుష్పా అధ్యాపకులు కె సురేష్, డా. మదీనా, డా. బంగార్రాజు, సతీశ్, రాజేశ్ అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్ధినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాల వారికి కనీస సౌకర్యాలు కల్పించాలి



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 7:** స్థానిక పురపాలక సంఘ పరిధిలో గృహాలబ్ధిదారులకు బోడసకుర్రు గ్రామంలో నిర్మించిన టిడ్కో సముదాయ గృహాలలో నివాసితులకు కనీస వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కానీ కలెక్టరేట్ నందు టిడ్కో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి త్రాగునీ రు, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ మురికి నీరు పారే ఏర్పాట్లు, విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలను పరిష్కారం, బరియల్ గ్రౌండ్ ఏర్పాటు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు స్థానికంగా తీసుకుని ఏర్పాట్లు సరిహద్దు గోడ నిర్మాణం ఇత్యాది అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టిపి మురుగునీరు పైపులైన్ ద్వారా మోటార్ల సహాయం తో బయట కు పంపేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. త్రాగునీటి కొరకు పక్కనే ఉన్న పంట కాలువ నుండి పైప్లైన్ ద్వారా ఓ హెచ్ ఎస్ ఆర్ వరకు పంపించేస్తూ స్థాని కంగా మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేసి నీటి సరఫరాకై ప్రతి పాద నలు రూపొం దించాలన్నారు. కాలువలు మూసివేత సమ యంలో బోరుబావి నుండి నీరు సరఫరా చేయాలని ఆదేశించా రు. పురపాలక సంఘం పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు బోడస కుర్రు గ్రామానికి మ్యాపింగ్ చేస్తూ స్థానికంగా పింఛన్లు పొందే ఏర్పాటు చేయాల న్నారు. వీధి లైట్లకు మున్సి పల్ కమిషనర్ మరమ్మ త్తులు చేయాలన్నారు. సరిహద్దు గోడ నిర్మించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలన్నారు బరియల్ గ్రౌండ్ను ఏర్పాటుకు ఉపాధి అనుసంధానంతో ప్రతిపా దనలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, మున్సిపల్ కమిషనర్ వి నిర్మల్ కుమార్, ఆర్డబ్ల్యూఎ స్ఎస్సి సి సి హెచ్ ఎన్ వి కృష్ణారెడ్డి, టిడ్కో ఎఇ మోహన్ రావు, మున్సిపల్ డి ఈ సత్యనారాయణ టి పి ఓ రాణి సంయుక్త ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- నాకాబందీ తనిఖీల్లో సీఐ ప్రశాంత్‌కుమార్
- తనిఖీల్లో నాటు తుపాకీ స్వాదీనం





**అల్లవరం,పెన్ పవర్, ఆగస్టు 07:** ప్రశాంతంగా ఉన్న ఆవాస ప్రాంతాల్లో అసాంఘిక శక్తులు చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే కఠిన చర్యలు తప్పవని అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్ హెచ్చరించారు. నాకాబందీ కార్యక్రమంలో భాగంగా అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లవరం ఎస్సై బి. సంపత్‌కుమార్, రూరల్ ఎస్సై, టౌన్ ఎస్సైలు, సిబ్బంది అల్లవరం మండల పరిధిలోని మొగళ్లమూరు, రెల్లుగడ్డ, తూర్పులంక,ఓడలరేవు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఉపాధి పనుల నిమిత్తం గ్రామంలో కొత్తగా వచ్చిన వారి వద్ద ఏమైనా అనుమానస్పదమైన వస్తువులు కలిగి ఉన్నా, వినియోగిస్తున్నా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. పలు గ్రామాల్లో డోర్‌టూ డోర్ తిరిగి తనిఖీలు నిర్వహించారు.
రెల్లుగడ్డ గ్రామంలో నాకాబందీలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పిట్టలు వేటాడేందుకు వెంట తెచ్చుకున్న నాటు తుపాకీతో ఓ వ్యక్తి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన పత్తి హనుమంతు అనే వ్యక్తి నాటు తుపాకీతో వెళ్తుండడం గమనించిన ఎస్సై సంపత్‌కుమార్ అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనుమతులు లేకుండా నాటు తుపాకీ కలిగి ఉండడం నేరమని, దీంతో తుపాకీని స్వాదీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

ఉ. తూ. జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 7:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనేనపార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మీద వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ పై వాక్యలు చేసే స్థాయి మీదికాదని గుర్తుచేసుకోవాలని ఇటువంటి వాక్యలు పునరావృతం కారాదని హెచ్చరించారు.
తక్షణం బహిరంగ క్షమాపనులు చెప్పాలని డిమాండ్ చేసారు.

## రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి




**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 7:** రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని హీపర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు.

వై రామవరం వెలుగు ఆఫీస్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓ బిజినెస్ ప్లాన్ ట్రైనింగ్ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ రైతులు గ్రామాలలో ఉన్న గ్రామ సంఘాలను సక్రమంగా నిర్వహించుకోవాలని వాటి ద్వారా వ్యాపారం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. మండలంలో 30 గ్రామ సంఘాల అభివృద్ధి చెందాలని తెలిపారు. సంఘాల అకౌంట్లో ద్వారా పొదుపు చేసుకోవాలన్నారు. వెలుగు ఎఫ్ బి ఓ సీసీ నాని బాబు మాట్లాడుతూ ఇకనుండి ప్రతి నెల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సమస్యలపై చర్చించి వాటి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ మంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు పంటలకు పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. అటీవీ శాఖ, రూరల్ ఎన్లైట్మెంట్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ సమైక్యంగా నిర్వహించిన మొక్కలు పంపిణీ కార్యక్రమం లో హీపర్, నవజీవన్ సభ్యులు పాల్గొన్నారు. రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్యవటం గ్రామంలో స్నానాల ఘాట్ నిర్మాణం

- చందాల ఆదినారాయణ ఆధ్వర్యంలో 20 వేల రూపాయలతో నిర్మాణం పూర్తి




**కాజులూరు పెన్ పవర్,ఆగస్టు 7:**
కాజులూరు మండల పరిధిలోని ఆర్యవటం గ్రామంలో మహిళల సౌకర్యార్థం స్నానాల ఘాట్ నిర్మాణాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చందాల ఆదినారాయణ స్వయంగా ముందుకొచ్చి నిర్వహించారు.సుమారు రూ. 20,000 వ్యయంతో ఈ ఘాట్‌ను నిర్మించినట్టు ఆయన తెలిపారు.వివిధ పండుగల సందర్భంగా, ముఖ్యంగా వినాయక చవితి, కార్తీక మాసం వంటి సందర్భాల్లో కాలువల వద్ద దీపారాధనలు, దీపాల వదిలింపు, స్నానాలు వంటి ఆచారాలను నిర్విఘ్నంగా నిర్వహించేందుకు ఈ ఘాట్ ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.ఈ ఘాట్ నిర్మాణంలో చందాల ఆదినారాయణ కుమారులు కూడా ఆయనతో కలిసి పనిచేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఈ నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయం అని స్థానికులు పేర్కొన్నారు.మహిళలు ఈ ఘాట్ ద్వారా స్నానాలు చేయడంలో భద్రత, గౌరవం కలుగుతుందని, అలాగే ఇతర అవసరాలకు కూడా ఇది దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. పనులన్నీ వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా చందాల ఆదినారాయణ కుటుంబ సభ్యులు పర్యవేక్షణలో నడిపినట్లు తెలిసింది.

## బైకును ఢీకొన్న లారీ- నలుగురికి తీవ్ర గాయాలు

- గాయపడ్డ బాలిక చికిత్స పొందుతూ మృతి



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 07 :** మండలంలోని బావాజీపేట గ్రామ సమీపంలో బైకును లారీ ఎదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడగా వారిలో తీవ్రంగా గాయపడ్డ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది.ప్రత్యక్షసాక్షులు బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని కామరాజుపేట గ్రామానికి చెందిన పండూరి రాంబాబు తన భార్య వరలక్ష్మి, కుమార్తె షణ్ముఖి(7) కుమారుడు పూర్ణకిరణ్ తేజ్ లతో కలిసి మోటార్ సైకిల్ పై రాజమహేంద్రవరం గోదావరి స్నానానికి వెళ్ళి తిరిగి కామరాజుపేట వస్తుండగా బావాజీపేట గ్రామ సమీపంలోని పోలవరం కాలువ వంతెనపై ఎదురుగా వస్తున్న గ్యాస్ ట్యాంకర్ లారీ బైకును ఢీకొంది . దీంతో నలుగురు రోడ్డుపై పడిపోవడంతో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు.అటుగా వెళుతున్న కారులో వీరిని వైద్యం నిమిత్తం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అపస్మారకస్థితిలో ఉన్న చిన్నారులకు వైద్యులు డాక్టర్ జానకి సీపీఆర్ చేయడంతో వారు స్పృహలోకి వచ్చారు.వీరిని వెంటనే మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే తీవ్రగాయాల పాలైన షణ్ముఖి చికిత్స పొందుతూ మృతిచెందింది.కాగా విషమస్థితిలో ఉన్న పూర్ణకిరణ్ తేజ్ ను మరింత మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని,లారీ డ్రైవర్ ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీఎస్వీ పవన్ కుమార్ తెలిపారు.

# చేనేత రంగానికి పూర్వ వైభవం తెస్తాం



- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- మగ్గాలకు విద్యుత్ రాయితీలు - నూలుకు సబ్సిడీలు
- ఆదివారపుపేట, అద్దంపల్లి చేనేత కార్మికులను దత్తత తీసుకుంటానని హామీ



**రామచంద్రపురం, ఆగస్టు 7 పెన్ పవర్:**"చేనేత రంగాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. నేతన్నల సంక్షేమమే మా లక్ష్యం. చేనేతకు పూర్వ వైభవాన్ని తీసుకురావడమే కూటమి ప్రభుత్వ అభిప్రాయం," అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.గురువారం ఆదివారపుపేటలో నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన, చేనేత కార్మికుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారపుపేట మరియు అద్దంపల్లి గ్రామాల్లోని చేనేత కార్మికులను దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**మగ్గాలకు విద్యుత్ రాయితీలు -నూలుకు సబ్సిడీలు**

మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అధిగమిస్తూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో అనేక విధానాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ త్రిఫ్ట్ రుణాలు మంజూరు ఆప్కో ద్వారా విక్రయాల పునరుద్ధరణ నూలుకు సబ్సిడీ.చేనేత వస్త్రాలపై 5% జీఎస్టీ మినహాయింపు.నేతన్న నేస్తం ద్వారా రూ.25,000 ఆర్థిక సహాయం ఈ నెల 16వ తేదీన చేనేత రంగ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించి, తగిన నిర్ణయాలు తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.నేతన్నల జీవితాల్లో వెలుగులు ఈ సందర్భంగా ముద్రా రుణాల కింద 90 మంది నేతన్నలకు రూ.45 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. 50 ఏళ్ల పైబడ్డ నేతన్నలకు రూ.4,000 పింఛన్ అందిస్తున్నట్టు తెలిపారు. వీవర్స్ షాలల నిర్మాణం, టెక్స్టైల్ పార్కులు, క్లస్టర్ అభివృద్ధి, ఒక జిల్లా -ఒకే ఉత్పత్తి పథకాల ద్వారా చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు.

**చేనేత– భారతీయ సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం**

కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయం తర్వాత అత్యధిక మంది ఆధారపడే రంగం చేనేతేనని చెప్పారు. గాంధీజీ నూలుపోగు రాట్నంతో చేసిన ప్రచారం ఉదాహరణగా ప్రస్తావించారు. మంగళగిరి చీరలు, ధర్మవరం వస్త్రాలు, కలంకారీ కళాకాంతులు భారతీయ చేనేత సౌందర్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు.చేనేత కార్మికుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నూతన డిజైన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెస్ ఎం ఇ పార్కులలో నేతన్నల కోసం ప్రత్యేక యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రంగంలో ఏపీకి కేంద్రం నుండి 26 అవార్డుల్లో 9 దక్కడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో జౌళి సంచాలకులు ధనుంజయరావు, ఆర్డీవో దేవరకొండ అఖిల, జౌళిశాఖ ఏడీ పెద్దిరాజు, తహసిల్దార్ మృత్యుంజ యరావు, ఎంపీడీవో పద్మజ్యోతి, వాసంశెట్టి సత్యం, పోలిశెట్టి చంద్రశేఖర్, సొసైటీ సెక్రటరీలు, ఏడీవోలు, గంగరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## స్వర్ణాంధ్ర సాధనకే అధికారులు కృషి చేయాలి



కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 7:** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యంతో పి4 కార్యక్రమం లక్ష్యాలను చేరుకునేందుకు గ్రామ సభలు సర్వేలు నిర్వహణ ద్వారా బంగారు కుటుంబాల అవసరాల గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు.గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, స్వర్ణాంధ్రఏ 2047 లక్ష్యాలు సాధన పి4 సర్వే, బంగారు కుటుంబాల దత్తత,పాజిటివ్ పబ్లిక్ సంతృప్తి స్థాయిల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 65 వేల బంగారు కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 40 వేల బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వడం జరిగిందని తెలిపారు.నిర్దేశిత ప్రగతి లక్ష్యాల మేరకు స్వర్ణాంధ్ర సాధనకై అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు.పనితీరు మెరుగుపరుచుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటూ జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు.ప్రజా సంతృప్తి కొలమానంగా అన్నా క్యాం టీన్లలో ఆహార నాణ్యత పై దృష్టి పెట్టాలని, సమయానికి తెరిచే విధంగా చర్యలు తీసుకుంటూ సంతృప్తి స్థాయిలను మెరుగు పరచాలన్నారు బహిరంగ ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పన అంశాలలో పోలీసు శాఖ సమన్వయం తో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి మహిళల భద్రత అంశాల పట్ల ప్రచారం గావించాలన్నారు.పురపాలక సంఘాలు గ్రామాలలో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత మెరుగుపరుస్తూ ప్రజాసంతృప్తిస్తాయని చేరుకోవాలన్నారు.త్రాగు,సాగు నీటి సంరక్షణ పై దృష్టి సారించి వర్షపు నీటిని ఓడిసిపెట్టి నీటిని సమృద్ధిగా నిల్వ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జ డ్వామా పిడి మధుసూదన్ మున్సిపల్ కమిషనర్లు,సిపిఓ మురళీకృష్ణ, డిపిఓ శాంత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులకు ప్రత్యేక కిట్లు పంపిణీ

**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 7:**
శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రతంను పురస్కరించుకొని కాకినాడ సిటీ ప్రెస్‌క్లబ్ సభ్యుల కుటుంబాల కోసం ప్రత్యేక వ్రత కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్ మరియు కార్యదర్శి డి. మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు సభ్యులకు వరలక్ష్మీ దేవి రూపం, పసుపు, కుంకుమ, జాకెట్ పీస్, గాజులు, మరియు వ్రత విధాన కథా పుస్తకంతో కూడిన సంపూర్ణ కిట్‌ను అందజేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పవిత్ర వ్రతాన్ని మరింత సౌలభ్యంగా చేసేందుకు ఈ చర్య చేపట్టినట్లు వారు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ,సభ్యుల కుటుంబాలు ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు . భవిష్యత్తులో మరిన్ని సేవా




కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రెస్‌క్లబ్ కట్టుబడి ఉంది,"అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆకెళ్ల శ్రీనివాస్, గుండు శ్రీనివాసరావు, రాజు, శ్రీధర్, సురేష్, రాయవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
సభ్యులు పెద్ద ఎత్తున హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు.



**కిర్లంపూడి పెన్ పవర్ ఆగస్టు 7:** మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మండల కేంద్రమైన కిర్లంపూడి ఎస్సీ పేటలో ఉన్న సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. సంఘ కాపరి ఐ షాలెంరాజు,పలువురు సంఘ పెద్దలు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొని తమ అభిమాన నాయకుడు మాజీ మంత్రి, ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కన్నీటి ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ పెద్దలు మాట్లాడుతూ చుట్టుపక్కల ఏ నాయకుడు లేనివిధంగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆయన ఇంటికి ఎవరు వెళ్లినా ఎంతో ఆప్యాయంగా పలకరించడమే కాకుండా తనదైన శైలిలో మర్యాద ఇచ్చే వారిని అలాంటి నాయకుడు అనారోగ్యానికి కూడా కావడం తమను ఎంతగానో కలిసి వేసిందన్నారు. ఆయన ఆరోగ్యం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి చేరుకోవాలని చర్చి సంఘ సభ్యులందరూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ దేవుని దయ వలన ముద్రగడకు సంపూర్ణ ఆరోగ్యం కలుగ చేస్తారని ఆ ప్రభువు పేరిట నామమున ఊరి ప్రార్థించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘ పెద్దలు, అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో భారీగా పిడిఎస్ బియ్యం పట్టివేత

- 29 టన్నుల పిడిఎస్ బియ్యం తరలిస్తున్న మూడు వాహనాలు సీజ్





**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 7:** అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని గురువారం జగ్గంపేటలో పట్టుకున్నారు. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం నిఘా పెట్టామన్నారు. జగ్గంపేట మెయిన్ రోడ్ లోనే అనుమానస్పదంగా ఉన్న వ్యాన్ ను నిలుపుదల చేసి తనిఖీ చేయగా అందులో పిడిఎస్ బియ్యం ఉండడాన్ని గుర్తించామన్నారు. వెంటనే వ్యాన్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేస్తున్న తరుణంలో మరో రెండు వాహనాల్లో పిడిఎస్ బియ్యం జగ్గంపేట రైస్ మిల్లుకు వెళుతుందని సమాచారం రావడంతో వెంటనే తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో జగ్గంపేట బాలాజీ రైసు మిల్లు వెనుక రెండు వెహికల్స్ దొంగచాటుగా దాచి ఉంచారన్నారు. వీటిని తాము గుర్తించి తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం ఉందన్నారు. దీనిపై అక్కడున్న వ్యక్తులను ప్రశ్నించగా వారు పారిపోయారన్నారు. ఈ రైసుమిల్లు వారు అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై మిల్లు యాజమాన్యం తమకు సరిగ్గా సహకరించలేదన్నారు. ఈ దాడిలో ఒక వాహనంలో 20 టన్నులు బియ్యంతో కూడిన లారీ, మరో వాహనంలో ఐదు టన్నులతో వ్యాన్, ఉదయమే మరో నాలుగు టన్నులతో వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. వీటిపై 6ఏ కేసు నమోదు చేసి వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ కు తరలించామన్నారు. అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ రేషన్ కార్డుదారులు బియ్యాన్ని అమ్మవదని రేషన్ బియ్యంలో పోషకాలున్నాయన్నారు. కార్డుదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్లఫారాలు, మిల్లులతో మధ్యవర్తులు బేరాలు కుదుర్చుకుని ఎవరైతే ఎక్కువ ఇస్తున్నారో వారికి అక్రమంగా బియ్యాన్ని అమ్ముతున్నారన్నారు. మిల్లులను కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# చిన్నతనం నుంచి చదువుల పట్ల శ్రద్ధ చూపించాలి...

- మాదిగ పల్లెలను సందర్శించిన ఐ ఎన్ ఎఫ్ ఓ ఆర్ ఎం ఇంటర్నేషనల్ సంస్థ





**ఎటపాక, పెన్ పవర్,ఆగస్టు 07:**ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో ఇంటిలెక్చువల్ ఫారం ఫర్ మాదిగ ఇంటర్నేషనల్ సంస్థ వారు మాదిగ పల్లెల సందర్శనలో భాగంగా గురువారం నెల్లిపాక ఎస్సీ కాలనీ సందర్శించారు, ఈ కార్యక్రమంలో ముందుగా మాదిగ పల్లెలో ఉన్నటువంటి వీధులను తిరుగుతూ వారి యొక్క అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు, అనంతరం చిన్న పిల్లలతో కలిసి ఆరోగ్య విషయంలో పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తలను పిల్లల తల్లిదండ్రులకు సూచనలు సలహాలను తెలియజేశారు, అనంతరం సంస్థ అధినేత గడ్డం బాపిరాజు మాట్లాడుతూ... చిన్నతనం నుంచే పిల్లలకు విద్యను అందించాలని అలా అందించడం వలన పిల్లల యొక్క మేధాశక్తి పెరుగుతుందని, చదువుల పట్ల శ్రద్ధ కలుగుతుందని, రానున్న రోజుల్లో ఉద్యోగాలు పట్ల పోటీ తత్వం ఎక్కువగా ఉంటుందని, అటువంటి పోటీలను ఎదుర్కొనే విధంగా చిన్నతనం నుంచే కష్టపడి చదివే తత్వాన్ని పిల్లలకు బోధించాలని ఉద్దేశంతో మాదిగ పల్లెల సందర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు, నేటి సమాజంలో మాదిగల పట్ల చాలా చులకన భావం ఉందని అటువంటి భావన ఉన్నవారికి మనం చదువుకునే చదువులు చేసే ఉద్యోగాలతో సమాధానం చెప్పచ్చని అన్నారు, అదేవిధంగా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సమాజంలో గుర్తింపు పొందే తత్వం కలిగి ఉండాలని, చెడు మార్గాలను ఎంచుకునే వారికి సమాజంలో గుర్తింపు ఉండదని, వాటి నుండి దూరంగా ఉండాలని అన్నారు, చిన్నపిల్లల కోసం ఎస్సీ కాలనీలో ఒక టీచర్ తో ట్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఇంటలెక్చువల్ ఫారం ఫర్ మాదిగ సభ్యులు అడ్వకేట్ పింగిలి .విజయ్, అడ్వకేట్ పేరాల. సత్యనారాయణ, ఐటీసీ ఎంప్లాయ్ నడిపింటి .మధు, కూనవరం గడ్డం .వెంకటేశ్వర్లు, ఏ. వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు,కాలనీ యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

# పేద గిరిజన కుటుంబానికి సహాయం చేసిన గడ్డిపాటి






**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 7.**మండలంలోని పండ్రాజుపల్లి గ్రామానికి చెందిన కారం దుర్గా, వినోద్ దంపతుల కుమార్తె షణ్ముఖ ప్రియా 5 నెలల పాప అనారోగ్య కారణంగా కాకినాడ ఏరియా హాస్పిటల్ వైద్యానికి వెళ్లగా ఆరోగ్యం విషమించి మరణించింది.కాకినాడ నుండి పాపను స్వగ్రామానికి తీసుకురావడానికి ఆర్థిక స్తోమత లేక సహాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్ కు సమాచారం తెలియడంతో వెంటనే తన సమస్యగా భావించి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కి సమాచారాన్ని తెలియపరచి పాప భౌతికాయాన్ని మహాప్రస్థానం వాహనం ద్వారా స్వగ్రామానికి చేర్చారు.గత వరదల సమయంలో కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.ప్రజలకు సమస్య ఉంటే తన సమస్యగా భావించి పరిష్కరించడం తనకే చెల్లుతుంది.పాప యొక్క తల్లిదండ్రులు మీకు రుణపడి ఉంటామని అన్నారు.

# పెద్దాపురం పట్టువస్త్రాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటుతాం

## డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్టు 7 :** పెద్దాపురం పట్టువస్త్రాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటేందుకు కృషి చేయడం జరుగుతుందని, చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పట్టణ పరిధిలోని స్థానిక ముప్పన రామారావు చేనేత సహకార సంఘం భవనంలో గురువారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రామస్వామి మాట్లాడుతూ చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పేట వేస్తుందని, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు విద్యుత్తు రాయితీ కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పెద్దాపురం చేనేత వస్త్రాలు, పట్టు చీరలకు జాతీయస్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఒక జిల్లా - ఒక ప్రొడక్ట్ కింద పెద్దాపురం సిల్క్ చీరకు గుర్తింపు దక్కడంతో గత నెలలో జిల్లా కలెక్టర్ షన్మోహన్ జాతీయ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో అవార్డు గెలుచుకోగల అత్యుత్తమ నాణ్యత కలిగిన చేనేత ఉత్పత్తులు మన జిల్లాలో ఉన్నాయని తెలిపారు. చేనేత వస్త్రాల ప్రోత్సాహానికి జిల్లా యంత్రాంగం ఇప్పటికే శ్రీకారం చుట్టిందని ఇటీవల కాకినాడలో ప్రారంభమైన 15వ జాతీయ స్థాయి బాలికల హాకీ టోర్నమెంట్ విజేతలకు పెద్దాపురం పట్టు చీరలను బహుమతిగా అందించాలని తెలిపారు. మన ఉత్పత్తులను ఉన్నత వేదికలపై ప్రదర్శించడానికి ఒక చక్కటి అవకాశమని తెలిపారు. ఇకపై జిల్లాలో జరిగే ప్రతీ ప్రభుత్వ కార్యక్రమంలో ప్రతీ వేదికపైన పెద్దాపురం చేనేత ఉనికి ఉండేలా చూడాలని సూచించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటూ గుర్తింపు తీసుకువస్తున్నారన్నారు. ఇంతటి గొప్ప కళను కాపాడుతున్న చేనేత కార్మికులను, వారి కుటుంబాలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జయశంకర్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమితోనే అభివృద్ధి సాధ్యం-ఎమ్మెల్యే మద్దిపాటి





**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 7 :**కూటమి ప్రభుత్వం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యపడుతుందని గోపాలపురం శాసనసభ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.గోపాలపురంలో టిడిపి అధ్వర్యంలో చేపట్టిన తొలి అడుగు సుపరిపాలన కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు.ముందుగా టిడిపి నాయకులు,ఎమ్మెల్యే అధ్వర్యంలో జాతీయ రహదారి నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.అక్కడ ఆ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం చెక్ పోస్ట్ సెంటర్ వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు ఈ ర్యాలీ కొనసాగింది.అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తున్నానన్నారు. ముఖ్యంగా గోపాలపురంలో కోట్ల రూపాయలు హెచ్చించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు,వ్యాపారవేత్త గంటా మధు కృష్ణ,టిడిపి నాయకులు చిన్నబాబు,టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొర్లపాటి రాము,మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ క్రిష్ణ చైతన్య మఠంలో ఘనంగా జన్మాష్టమి వేడుకలు








- మురిపాల గోపాలుడికి నృత్య నీరాజనం..
- అలరించిన చిన్నారుల కూచి పూడి నృత్యాలు
- స్వామివారికి ఊంజల్ సేవ, హరి భజనలు, సంకీర్తనలు

**విశాఖ కల్చరల్, పెన్ పవర్, ఆగస్టు 07:**
విశాఖలోని శ్రీ క్రిష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ జంక్షన్ లోని శ్రీ క్రిష్ణ చైతన్య మఠంలో స్వామివారి ఆలయంలో ఆనంద మేళా నిర్వహిస్తున్నారు. జన్మష్టామి వేడుకల్లో భాగంగా చిన్నారులు స్వామివారికి నృత్య నీరాజనం సమర్పించారు. రూపా డాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు తమ నృత్యాలతో గోపాలుడిని కీర్తిస్తూ.. తన్మయత్వంతో కూచిపూడి నృత్యాలు చేశారు. మురిపాల గోపాల రారా క్రిష్ణా, జై జనార్ధనా, శ్రీ కరశుభకర, గణనాయకాయ, హరె క్రిష్ణ తదితర పాటలకు చిన్నారులు లయబద్ధంగా నృత్యాచేశారు. కుండ నృత్యాలు, బిందె నృత్యాలు, హారతి చేతబట్టి చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బృంత నృత్యాలతోపాటు సోలో డాన్సులు కూడా స్వామివారి పేరుతో చేసి రక్తికట్టించారు. జన్మాష్టమి వేడుకల కోసమే ప్రత్యేకంగా శిక్షణ పొందిన చిన్నారులు డాన్సు అధ్యాపకులు రూపా ఆధ్వర్యంలో చక్కటి ప్రతిభను కనబరిచి ఆహుతులకు వీనుల విందుని పంచారు. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఫళ శయన ఊయలలో ప్రతిష్టింజేసి ఊంజల్ సేవ్ నిర్వహించి, హరి సంకీర్తనలతో భనలు చేశారు. హరే రామ హరే క్రిష్ణ.. క్రిష్ణ క్రిష్ణ హరే హరే అంటూ గోపాలుని స్థుతించారు. ఈ సందర్భంగా ఉత్తమ దాసు మాట్లాడుతూ, చిన్నారులు ఆ నంద గోపాలడిని కీర్తిస్తూ చేసిన నృత్యాలు చేయడం.. అందునా స్వామివారి సన్నిధిలో నృత్య నీరాజనం సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు ఈ కూచిపూడిలో మరింత శిక్షణ పొంది మరిన్ని ప్రదర్శనలు ఇవ్వడంతో గోపాలడిపేరుతో అన్ని వేదికలపైనా నృత్యాలు చేసి స్వామి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికేట్లను, షీల్డులను, స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అనీల్, స్వామివారి దాసుడుఈశ్వర్రావు, అధిక సంఖ్యలో భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎంత పాపం చేశావ్ రేవంత్..?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోనూ ఇటీవల మహిళల సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకు చేపట్టిన మహాలక్ష్మి పథకం చర్చనీయాంశమవుతోంది. ఈ పథకం కింద ప్రభుత్వానికి చెందిన పోస్టాఫీసుల్లో ఖాతా తెరవడం ద్వారా నెలకు రూ.2500 అందుతాయని వార్తలు ప్రచారమయ్యాయి. ఈ వార్తల వల్ల నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు ఎదుట మహిళలు భారీగా గుమికూడారు.

ఈ సందర్భంగా తలెత్తిన అయోమయం, అవగాహన లోపం వల్ల ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వారి మధ్య మాటామాటా పెరిగి చివరికి జుట్లు పట్టుకుని కొట్టుకునే దాకా వెళ్లింది. ఈ ఘర్షణ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముఖ్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు.

**కేటీఆర్ ట్వీట్**

ఈ వీడియోను %ఴ% లో షేర్ చేసిన కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు."ఎంత పాపం చేశావ్ రేవంత్.. నిన్నటివరకు %=ుజ% బస్సుల్లో ఆడబిడ్డల మధ్య కొట్లాట పెట్టావు. ఇప్పుడు మహాలక్ష్మి పేరిట మభ్యపెట్టి జుట్లు పట్టుకొని కొట్టుకునేలా చేస్తావా?" అంటూ ప్రశ్నించారు.

**పాలసీపై అపోహలే కారణం?**

అధికారికంగా ఈ పథకం అమలులో ఉన్నదా లేదా అన్న దానిపై స్పష్టత లేకపోవడం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన లేకపోవడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడ్డట్లు చెబుతున్నారు. ఈ పథకం కింద నెలకు డబ్బు జమవుతుందనే భావనతోనే పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవాలనే ఉద్దేశంతో మహిళలు భారీగా చేరుకున్నారు.

**ప్రభుత్వ స్పందన అవసరం**

ఈ ఘటనల నేపథ్యంలో మహాలక్ష్మి పథకం పట్ల ప్రజల్లో స్పష్టత కలిగించేలా ప్రభుత్వం వెంటనే స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉంది. పథకాలను ప్రకటించినంత వేగంగా వాటి అమలుపై స్పష్టత ఇవ్వకపోతే ఇలా కలవరం, అపోహలు, ఇబ్బందులు తలెత్తడం కొత్త విషయం కాదు. ప్రజల సంక్షేమం కోసం తెచ్చిన పథకం, వారి మధ్య గొడవలకు కారణం

కావడం విచారకరం. ప్రభుత్వం ఎటువంటి సంకేతాలు ఇస్తున్నదీ, వాటి అమలు ఎలా జరుగుతుందన్నది స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఇప్పటికీ ఉంది. లేదంటే నిస్సందేహంగా ఇలాంటి సంఘటనలు మరిన్ని చోటుచేసుకునే అవకాశముంది.

# ఒక్క నియోజకవర్గంలోనే లక్ష నకిలీ ఓట్లు! రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు




**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘం పై చేసిన తీవ్రమైన ఆరోపణలు దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి. ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని, లక్షలాది నకిలీ ఓట్లు నమోదయ్యాయని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలు ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**బెంగళూరులో లక్ష నకిలీ ఓట్లు**

రాహుల్ గాంధీ ముఖ్యంగా కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. అక్కడ ఉన్న మొత్తం 6.5 లక్షల ఓటర్లలో సుమారు లక్ష నకిలీ ఓట్లు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ నకిలీ ఓట్లలో వివిధ రకాల అవకతవకలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇందులో డూప్లికేట్ ఓటర్లు 11,965 మంది, తప్పుడు చిరునామాలతో ఉన్న ఓటర్లు 40,009 మంది, బల్క్/ఒకే చిరునామాతో ఉన్న ఓటర్లు 10,452 మంది, తప్పుడు ఫొటోలు ఉన్న ఓటర్లు 4,132 మంది, ఫారం-6 దుర్వినియోగం ద్వారా నమోదైనవారు 33,692 మంది ఉన్నారు. ఈ గణాంకాలు ఓటర్ల జాబితాలో లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు.

**మహారాష్ట్రలో కొత్త ఓటర్ల నమోదుపై అనుమానాలు**

మహారాష్ట్రలో ఓటర్ల నమోదుపై కూడా రాహుల్ గాంధీ అనుమానాలు వ్యక్తం చేశారు. గత ఐదు నెలల్లోనే 40 లక్షల కొత్త ఓటర్లు నమోదయ్యారని, ఇది గత ఐదేళ్లలో నమోదైన సంఖ్యను మించిపోయిందని ఆయన అన్నారు. ఈ గణనీయమైన పెరుగుదల సాధారణమైనది కాదని, దీనిపై లోతైన విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్యకాలంలోనే కోటి ఓటర్లు నమోదు కావడంపై కూడా ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు.

**ఈసీఐపై రాహుల్ గాంధీ ప్రశ్నలు**

రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తారు. తమ పార్టీ ఓటర్ల జాబితాను కోరినప్పటికీ, ECI నిరాకరించిందని ఆయన ఆరోపించారు. ఓటర్ల జాబితా దేశ సంపదని, అది పార్టీలకు ఎందుకు అందుబాటులో ఉండకూడదని ప్రశ్నించారు. మెషిన్ ద్వారా చదవగలిగే ఫార్మాట్‌లో ఓటర్ల జాబితాను ఇవ్వకపోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

**ఎన్నికల సంఘం స్పందన**

రాహుల్ గాంధీ ఆరోపణలకు కర్ణాటక రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం స్పందించింది. రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలపై ఆధారాలు ఇవ్వాల్సిందిగా కోరుతూ ఒక లేఖను రాసింది. నకిలీ ఓటర్ల వివరాలను డిక్లరేషన్ రూపంలో అందిస్తే, వాటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని %జజుూ% కార్యాలయం స్పష్టం చేసింది. ఈ పరిణామాలు భారత ఎన్నికల వ్యవస్థ పారదర్శకతపై తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఆరోపణలపై %జుజ×%, కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# లిక్కర్ స్కాం : పవన్ ఒక్కరే సేఫ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ లిక్కర్ స్కాం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. వైసీపీ ముఖ్య నేతలు ఈ కుంభకోణంలో ఇరుక్కుని ఇప్పటికే జైలుకు వెళ్లారు. అయితే స్కాంలో కీలక నిందితుడుగా చెబుతున్న ఏ34 వెంకటేశ్ నాయుడు పాత్ర ఇటీవల సంచలనంగా మారింది. ఆయన ఫోన్ నుంచి సిట్ వెలికి తీసిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలు అందరితోనూ ఆయన ఫొటోలు బయటకు రావడంతో లిక్కర్ స్కాంలో పాత్రధారులు అంటూ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తో వెంకటేశ్ నాయుడు ఫొటోలు దిగడంతో వైసీపీ అటాక్ ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోద్బలంతోనే స్కాం జరిగిందని ఆరోపిస్తోంది.

అయితే వైసీపీ ఆరోపణల్లో పస లేకపోయినప్పటికీ వెంకటేశ్ నాయుడు ఫొటోలు మాత్రం తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీల నేతలు అందరినీ ఉలికిపాటుకు గురిచేశాయి. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం మంత్రివర్గ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. వెంకటేశ్ నాయుడు వంటివారితో ఫొటోలు దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన మంత్రివర్గ సహచరులకు సూచించారు. వెంకటేశ్ నాయుడు ఎవరో ఎలాంటి వాడో ముందుగా చంద్రబాబుకు తెలియక పోయినప్పటికీ, నిందితుడు తనతో దిగిన ఫొటోను చూసి చంద్రబాబు షాక్ తిన్నారని అంటున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి లోకేశ్ తోపాటు ఇతర టీడీపీ నేతలతోనూ వెంకటేశ్ నాయుడు ఫొటోలు దిగారు. అదే సమయంలో తెలంగాణలో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులతోనూ సన్నిహిత సంబంధాలు నెరిపినట్లు బయటపడింది. డబ్బు కట్టలు లెక్కపెడుతున్న వెంకటేశ్ నాయుడు వీడియో వైరల్ అయిన తర్వాత చాలా ఫొటోలు బయటకు వచ్చాయి. రెండు రాష్ట్రాల్లో ముఖ్యులు అందరితోనూ ఆయన ఫొటోలు ఉండటంతో ఆయన ఎవరికి సన్నిహితుడు? ఏం చేస్తుంటాడు అన్న చర్చ మొదలైంది. అయితే ఇదే సమయంలో ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రమే వెంకటేశ్ నాయుడు నుంచి సేఫ్ గా తప్పించుకున్నారని అంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రముఖులు అందరితోనూ వెంకటేశ్ నాయుడు ఫొటోలు బయటపడ్డాయి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఎప్పుడో ఒకసారి వారు కలవడం జరిగింది. సందర్భం ఏదైనా నాటి ఫొటోలు ఇప్పుడు రచ్చకు దారి తీస్తున్నాయని అంటున్నారు.

కానీ, డిప్యూటీ సీఎం పవన్ మాత్రం ఈ ఎపిసోడ్ లో సేఫ్ గా ఉండటమే ఆసక్తికరంగా మారింది. దాదాపు పదేళ్లుగా రాజకీయాల్లో కీలకంగా ఉన్న పవన్ వద్దకు ఒకసారి కూడా వెంకటేశ్

నాయుడు వెళ్లలేదా? లేక పవన్ మాత్రమే ఆయన ఎవరో తెలుసుకుని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ముఖ్యమంత్రి, మంత్రి వంటి స్థాయి ఉన్న నేతల వద్దకు చాలా మంది వచ్చి కలుస్తుంటారు.. లిక్కర్ స్కాంలో నిందితుడు అయిన వెంకటేశ్ నాయుడు సైతం తన ప్రయోజనాల కోసం నేతలు అందరిని కలిసినట్లు చెబుతున్నారు. అయితే ఆయన పవన్ ను కలుసుకోకపోవడమే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ పవన్ ను కూడా వెంకటేశ్ నాయుడు కలిసి ఉంటే వైసీపీ మరింతగా అస్త్రాలు సంధించేది. అదే సమయంలో తమ పార్టీతో అతడి సంబంధం లేదని ఇంకా బలంగా చెప్పగలిగేది. కానీ, పవన్ ఈ విషయంలో విపక్షానికి ఆ అవకాశం ఇవ్వలేదని అంటున్నారు.

## నెల రోజుల్లో జిల్లాల విభజన.. బాబుపై విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు వస్తున్నాయి. కేవలం నెల రోజుల్లోనే ప్రస్తుతం ఏపీలో ఉన్న 26 జిల్లా లను 32 జిల్లాలుగా విభజించడంతోపాటు.. వాటికి కొత్త పేర్లు, రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల మార్పు వంటి వి చేసి తీరాలని చంద్రబాబు తేల్చి చెప్పారు. అయితే.. ఈ వ్యవహారం అంత తొందరగా జరుగుతుందా? అనేది సొంత నేతలు, మంత్రుల నుంచే ఎదురవుతున్న ప్రశ్న. ఇదే విషయాన్ని పలువరు ఎమ్మెల్యేలు కూడా ప్రశ్నిస్తున్నారు. గతంలో వైసీపీ కూడా ఇలానే తొందరపడి.. చేసిన పనికి ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని గుర్తు చేస్తున్నారు.ముఖ్యంగా జిల్లాల సరిహద్దులు నిర్ణయించడం.. మార్చడం అంటే.. రెండు మూడు జిల్లాలకు చెందిన అధికారులు, కలెక్టర్లు కలిసి తీసుకోవాల్సిన నిర్ణయం. దీనికి వారు కనీసంలో కనీసం.. ఐదారు రోజుల పాటు కసరత్తు చేయాల్సి ఉంటుంది. అనంతరం.. స్థానికుల నుంచి అభిప్రాయ సేకరణ కూడా చేపట్టాలి. వారి అభిప్రాయాలు.. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు.. ప్రముఖుల పేర్లు, అదేవిధంగా స్థానికుల సెంటిమెంటును దృష్టిలో పెట్టుకుని జిల్లాల విభజన చేయాలి. దీనికి ఎంత లేదన్నా.. ఐదు నుంచి ఆరు మాసాల సమయం పడుతుంది.మరీముఖ్యంగా ప్రస్తుతం వివాదంగా ఉన్న అన్నమయ్య జిల్లా, పల్నాడు జిల్లా, శ్రీసత్యసాయి జిల్లా, కోనసీమ, మన్యం జిల్లాల పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అక్కడ మార్పులు చేర్పులు చేయాలంటే. మరింత సమయం పట్టేలా ఉందని పార్టీ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. అదేసమయంలో రెవెన్యూ డివిజన్లను మార్చాలన్నా.. గ్రామ సభలను నిర్వహించి.. సరైన నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలి. అప్పటికి కానీ.. విభజన ప్రక్రియ చేపట్టే అవకాశం లేదని అంటున్నారు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం సీఎం చంద్రబాబుకేటాయించిన నెల రోజుల సమయం సరిపోదని.. హడావుడిగా నిర్ణయం తీసుకున్నా.. పార్టీకి ఒన గూరే ప్రయోజనం కూడా ఉండదని చెబుతున్నారు. గతంలో వైసీపీ మాదిరిగా పరిస్థితి మారితే ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. ఈ క్రమంలో కనీసంలో కనీసం.. నాలుగు మాసాల సమయం ఇవ్వాలని ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాదు.. కేంద్ర ఎన్నికల సంఘం వచ్చే మార్చి 31 వ తేదీ వరకు సమయం ఇచ్చినందున సమయం సరిపోతుందని అంటున్నారు. మరి చంద్రబాబు వీరి వినతులు పరిశీలిస్తారో లేదో చూడాలి.

## అమెరికాకు డంకీ రూట్.. అడ్డంగా బుక్కైన ఇద్దరు భారతీయులు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఇద్దరు భారతీయులను అక్కడి బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఈ ఘటన మెనే రాష్ట్రంలోని బ్రిడ్జ్‌వాటర్ సమీపంలోని అమెరికా–కెనడా సరిహద్దులో చోటుచేసుకుంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, కాలినడకన సరిహద్దు దాటి అమెరికాలోకి ప్రవేశించేందుకు వారు ప్రయత్నించారు. అయితే బోర్డర్ గస్తీ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు.

**డంకీ రూట్ కదలికలు మళ్లీ ఉధృతం?**

ప్రస్తుతం అరెస్టులో ఉన్న ఈ ఇద్దరు భారతీయుల వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. కానీ, ఈ ప్రాంతంలో సాధారణంగా ఇటువంటి అక్రమ చొరబాట్లు అరుదుగా జరుగుతుంటాయని చెబుతున్నారు. గత కొన్ని వారాలుగా అమెరికా సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంతో, డంకీ రూట్ ద్వారా అక్రమంగా ప్రవేశించే ప్రయత్నాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొనవచ్చు.

**గత వారం 16 మంది అరెస్ట్**

ఇటీవలి దర్యాప్తులలో భాగంగా గత వారం రోజుల క్రితం బ్రిడ్జ్‌వాటర్ ప్రాంతంలో బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది మొత్తం 16 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారు. వీరిలో 13 మంది రొమేనియా పౌరులు, 1 కొలంబియా దేశస్థుడు, ఇద్దరు భారతీయులు ఉన్నారు.

**ట్రంప్ పాలన కఠిన వైఖరి**

డంకీ రూట్ లేదా ఇతర అక్రమ మార్గాల ద్వారా అమెరికాలోకి ప్రవేశించే వారిపై ప్రస్తుతం ట్రంప్ సర్కారు మరింత కఠిన చర్యలు తీసుకుంటోంది. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్నవారిని గుర్తించి అరెస్టు చేసి స్వదేశాలకు తిరిగి పంపే ప్రక్రియ కొనసాగుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం, గత ఆరు నెలల్లో దాదాపు 1,700 మంది భారతీయులను అమెరికా నుంచి వెనక్కి పంపించారు.

**మిగిలిన భారతీయులకు హెచ్చరిక**

ఈ నేపథ్యంలో అమెరికాలో స్థిరపడాలనే ఆశతో అక్రమ మార్గాలు ఎంచుకునే భారతీయులకు ఇది గమనించదగ్గ పరిణామం. డంకీ రూట్ మార్గంలో ప్రయాణం చేయడం అనేక రిస్కులతో కూడుకున్నదే కాకుండా, అరెస్టు అయ్యే ప్రమాదం, దేశ బహిష్కరణ కూడా ఎదురవుతుంది. కావున చట్టబద్ధమైన వీసా, పత్రాలతోనే ప్రవేశించేలా ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## కడపలో వైఎస్ సునీత.. పులివెందుల ఉప ఎన్నికపై షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ సీఎం జగన్మోహనరెడ్డి చిన్నాన్న వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. కడప ఎస్పీ అశోక్ కుమార్ ను కలిసిన ఆమె అనంతరం మీడియాతో మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సమయంలో జరుగుతున్న పరిణామాల పట్ల భయాందోళన వ్యక్తం చేసిన ఆమె, గతంలో తన తండ్రి వివేకానందరెడ్డి హత్య మళ్లీ గుర్తుకు వస్తోందని వ్యాఖ్యానించారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో వైఎస్ సునీత ఎస్పీని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది."జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా రెండు రోజులుగా పులివెందులలో జరుగుతున్నఘటనలు చూస్తుంటే మా నాన్న వివేకా హత్య గుర్తుకొస్తుంది. గొడ్డలి పోటుతో వివేకాను హత్య చేసి గుండెపోటుగా నమ్మించారు. టీడీపీ నేతలు చంపించారని నమ్మబలికారు. పోలీసులను బెదిరించి క్రైం సీన్ తుడిచేశారు. హత్య తర్వాత ఓ లేఖ తెచ్చి మా నాన్నను ఆదినారాయణరెడ్డి, సతీశ్ రెడ్డి, బీటెక్ రవి చంపినట్లు సంతకం చేయమంటే నేను చేయలేదు. అవినాశ్ రెడ్డి అనుచరులు పోలీసులను బెదిరించారు" అంటూ సునీత చెప్పారు.

అదేవిధంగా ఇప్పుడు జరుగుతోంది. మా బంధువు సురేశ్ పై అవినాశ్ రెడ్డి అనుచరులు దాడి చేశారనే అనుమానం ఉంది. ఆరేళ్లుగా వివేకా హత్యపై పోరాడుతున్నాను. ఇప్పటివరకు దోషులకు శిక్ష పడలేదు. వివేకాను నేను, నా భర్త చంపినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాలి అని సునీత డిమాండ్ చేశారు. నాన్న మళ్లీ తిరిగిరాడు. ప్రజలు ఆలోచించి నిజం బయటకు వచ్చేలా చూడాలని సునీత కోరారు. రేపు వివేకానందరెడ్డి జయంతి. నా తల్లి నాకు పులివెందుల రావద్దని చెబుతోంది. న్యాయం కోసం పోరాడటానికి సెక్యూరిటీ పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి ఉందని

# 'వర్మ' తీరు.. న్యాయ వ్యవస్థపై క్షిపణి ప్రయోగం లాంటిది!



**హైదరాబాద్ పెన్ పవర్:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తీరుపై సుప్రీంకోర్టు.. తీవ్ర సంచలన వ్యాఖ్యలు చేసింది. %---%వర్మ%-% తీరు.. న్యాయ వ్యవస్థపై క్షిపణి ప్రయోగం లాంటిది%--% అని పేర్కొంది. ఆయన వేసిన పిటిషన్‌ను కూడా కొట్టి వేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తుల వ్యవహార శైలి.. సుప్రీంకోర్టును, భారత పవిత్ర న్యాయవ్యవస్థను కూడా ప్రశ్నించేలా ఉందని.. దీనిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని కూడా సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ క్రమంలో ఆయనను పదవి నుంచి తప్పించడం తప్ప.. మరో మార్గం లేదని పేర్కొంది.

**ఎవరు? ఏంటి?**

జస్టిస్ యశ్వంత్ వర్మ.. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా.. పదోన్నతి పొందారు. ఈ క్ర మంలో మార్చిలో ఆయన ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. దీనిని నిలువరించేందుకు ఢిల్లీ అగ్ని మాపక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. నీళ్లు కొట్టారు. కానీ, ఆ ఇంట్లోని స్టోర్ రూమ్‌లో.. నిల్వ చేసి.. 500 రూపాయల నోట్ల కట్టలు(వందల కోట్లు ఉంటాయని అంచనా) బయట పడ్డాయి. వీటిలో సగం కాలి పోగా.. మిగిలిన వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే దేశంలో న్యాయవ్యవస్థపై విమర్శ ల పెల్లుబుకుతున్నాయి

ఖచ్చితంగా ఆసమయంలో వర్మ ఇంట్లో దొరికిన నగదు మరింత కలకలం రేపడంతో సుప్రీంకోర్టు సీరి యస్‌గా తీసుకుని.. ఆయనను ఎలాంటి పనీ అప్పగించకుండా.. అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. అంతేకాదు.. సదరు నోట్ల కట్టలపై విచారణకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేసింది. ఈ కమిటీ పలుమార్లు విచారణ చేసి నివేదిక ఇచ్చింది. దీనిని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా కేంద్రానికి పంపించారు. వర్మను పదవి నుంచి తప్పించాలని సిఫారసు చేశారు.

ప్రస్తుతం ఈ వ్యవహారంపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ తీర్మానాలు పెండింగులో ఉన్నాయి. అయితే.. ఇంతలోనే సుప్రీంకోర్టు నియమించిన కమిటీలో తప్పులు ఎత్తి చూపుతూ.. సుప్రీంకోర్టును తప్పుబడుతు.. జస్టిస్ వర్మ.. అదే కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై రెండు సార్లు జరిగిన విచారణలో సుప్రీంకోర్టు ఆయనను తీవ్రంగా తప్పుబట్టింది.తాజాగా జరిగిన విచారణలో %---%వర్మ%-% తీరు.. న్యాయ వ్యవస్థపై క్షిపణి ప్రయోగం లాంటిది%--% అని వ్యాఖ్యానిస్తూ.. ఆయన పిటిషన్‌ను కొట్టి వేసింది. దీంతో పార్లమెంటు ద్వారా ఆయనను అభిశంసించేందుకు మార్గం సుగమం అయింది. చిత్రం ఏంటంటే.. ఈయన అభిశంసన తీర్మానం వివాదం అయి.. దేశ ఉపరాష్ట్రపతిగా ఉన్న ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# కాలం గుర్తుచేస్తుంది.. ట్రంప్ సుంకాలపై జొమాటో సీఈవో పోస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ ఉత్పత్తులపై భారీగా పన్నులు విధించడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. భారత్‌ను మిత్రదేశంగా పేర్కొంటూనే, దిగుమతులపై 50% వరకు పన్నులు విధించాలన్న ఆయన నిర్ణయంపై రాజకీయ, పారిశ్రామిక వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**ట్రంప్ పన్నుల వివరాలు**

ట్రంప్ తాజా ప్రకటన ప్రకారం భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా ఉత్పత్తులు, తోలు ఉత్పత్తులపై అదనంగా 25% పన్నులు విధించబడతాయి. ఇప్పటికే ఉన్న 25% పన్నులకు ఇది అదనం కావడంతో, మొత్తం పన్ను భారం 50%కు చేరనుంది. ఈ నిర్ణయం ఈ నెల 27వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఈ భారీ పన్నులు భారతీయ వ్యాపార రంగానికి పెద్ద సవాలుగా మారనున్నాయి.

**దీపిందర్ గోయల్ వ్యాఖ్యలు**

ఈ పరిణామాలపై గోయల్ తన ఎక్స్ ఖాతాలో ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఆయన పోస్ట్‌లో దేశానికి ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయి. "కాలం ఎప్పటికప్పుడు మన స్థానం ఏంటో గుర్తుచేస్తూనే ఉంటుంది. ఇప్పుడు పన్నుల రూపంలో మనముందు ఓ సవాల్ ఉంది. కానీ ఇవన్నీ ఎలా ఉన్నా, మన పనిని మనం నిరంతరం చేస్తూ ముందుకు సాగాలి. మన భవిష్యత్తును మనమే నిర్మించుకోకపోతే, ప్రపంచ శక్తులు మనపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఇలాంటి సమయంలో మనం ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణపరంగా, ముఖ్యంగా మన ఆశయాల్లో ఒక సమష్టిగా ముందుకు వెళ్లాలనే సంకల్పం తీసుకోవాలి. అప్పుడే మనం నిజమైన సూపర్‌పవర్‌గా ఎదుగుతాము." అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. చాలామంది గోయల్ వ్యాఖ్యలను దేశభక్తి, ధైర్యానికి నిదర్శనంగా పేర్కొంటున్నారు.

**భారత్ అధికారిక స్పందన**

ట్రంప్ నిర్ణయంపై భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది అన్యాయం.. అనుచితం అని పేర్కొంది. భారత ప్రభుత్వం తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అన్ని మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అమెరికాతో ఈ అంశంపై చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఈ పరిణామాలు భవిష్యత్తులో అమెరికా-భారత్ సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది వేచి చూడాలి.

ఈ క్లిష్ట సమయంలో గోయల్ వ్యాఖ్యలు ప్రజలలో ధైర్యాన్ని, ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకు సాగాలనే సంకల్పాన్ని నింపుతున్నాయి.

# వైసీపీ వర్సెస్ వివేకా !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి ఎన్నో సమస్యలు మరెన్నో చిక్కు ముడులు ఆ పార్టీ నాయకులే చెప్పుకున్నట్లుగా సమస్యల నుంచి సంఘర్షణల నుంచి వైసీపీ పుట్టింది. ఈ రోజుకీ సమస్యలతోనే ఆ పార్టీ అలా ముందుకు సాగుతోంది అధికారంలో ఉన్నా లేకపోయినా వైసీపీకి ఉన్న సమస్యలు కొని తెచ్చుకున్న సమస్యలు ఇలా అనేకం ఉంటూనే ఉన్నాయి వాటి నుంచి బయటపడేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తోందా లేక వాటితోనే ముందుకు సాగుతోందా అన్నదే ఒక సందేహంగా పేర్కొంటారు.

**బాబాయ్ తోనే అంతా :**

వైసీపీకి వివేకాకు రాజకీయ సంబంధం కంటే వ్యక్తిగత సంబంధమే ఎక్కువ. ఆయన జగన్ కి సొంత బాబాయ్. వైఎస్సార్ కి సొంత తమ్ముడు. దాంతో పాటు ఆయన కూడా రాజకీయాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తూ వచ్చారు. ఇక చూస్తే కనుక వైఎస్సార్ మరణించినపుడు వైఎస్ వివేకానందరెడ్డి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. జగన్ కాంగ్రెస్ ని వీడినపుడు ఆయన కాంగ్రెస్ ని అట్టిపెట్టుకునే ఉన్నారు. అదే పార్టీ ఆయనకు వ్యవసాయ మంత్రిగా అవకాశం ఇచ్చింది. ఆయననే వైఎస్ విజయమ్మ మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పులివెందుల నుంచి పోటీకి పెట్టింది. అలా వైసీపీకి ఆయన తొలి రోజులలో ఎదురు నిలిచే వచ్చారు.

**వైసీపీలో సైతం అలా :**

ఇక వైసీపీలోకి ఆయన 2014 ఎన్నికల ముందు వచ్చారు. ఆయన వైసీపీ విజయానికి ఆ ఎన్నికల్లో కృషి చేశారు అని చెబుతారు. ఇక 2016లో ఆయనకు స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ టికెట్ ఇస్తే ఓటమి పాలు అయ్యారు. ఇక 2019లో ఆయన మరోసారి వైసీపీ విజయానికి ప్రచారం చేస్తూనే దారుణ హత్యకు గురి అయ్యారు. ఈ హత్య ఎవరు చేశారు అస్మదీయులా తస్మదీయులా అన్న నిజాన్ని సీబీఐ నిగ్గు తేల్చలేకపోయింది. వైఎస్ వివేకాను హత్య చేసిన వారు అంటూ ఆయన కుమార్తె సునీత అయితే వైసీపీలోని కీలక నేతల వైపు వేలెత్తి చూపిస్తోంది.

**కొలిక్కి రాని కేసుతో :**

ఈ కేసు ఒక కొలిక్కి అయితే రావడం లేదు. శాఖాపరంగా తమ దర్యాప్తు పూర్తి అయింది అని సీబీఐ చెప్పవచ్చు కానీ రాజకీయంగా ఈ కేసు ఎప్పటికీ క్లోజ్ అయ్యేది ఉండదనే అంటున్నారు వైఎస్ కుమార్తె వేళ్ళు వైసీపీ మీద చూపిస్తున్నాయి. దాంతో వైసీపీకి తీవ్ర ఇరకాటంగానే ఉంటోంది. 2024 ఎన్నికల్లో వైఎస్ వివేకా హత్య కేసు విషయంలో వైఎస్ షర్మిల సునీత చేసిన ప్రచారం మీద వైసీపీ మీద తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో ఆ పార్టీ ఎంతగా నష్టపోయింది అందరికీ తెలిసిందే. ఇపుడు పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వచ్చింది. దీంతో మరోసారి సునీత తన తండ్రి హత్యను గుర్తు చేసుకుంటూ వైసీపీ మీదనే ఘాటు విమర్శలే చేశారు.

**వెంటాడుతున్న వివేకా :**

వైసీపీని వివేకా ఒక విధంగా వెంటాడుతున్నారా అన్న చర్చ సాగుతోంది. వైసీపీ 2024 ఎన్నికల్లో ఓడింది. కానీ దారుణమైన పరాజయం పునాదులలో నుని బలంగా ఉన్న చోట సంభవించింది అంటే దానికి కారణం వివేకా హత్య కేసు అనే విశ్లేషిస్తారు ఈ విషయంలో వైసీపీ తన సత్య సంధతను ఎక్కడ నిరూపించుకుంటుందో తెలియదు కానీ ఆ పార్టీకి అయితే రాజకీయంగా మాత్రం ఇబ్బందులు తెచ్చేది గానే ఉంది. ప్రత్యర్థులు రాయలసీమకు వచ్చినపుడల్లా ఈ హత్య కేసుని ప్రస్తావిస్తారు దాంతో వైసీపీకి ఇరాకాటంగానే ఉంటుంది అని అంటున్నారు. మరి వైసీపీ తన ప్రత్యర్థులతో పోరాటం చేస్తోంది కానీ వివేకా రూపంలో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారం కనుగొనలేకపోతోంది. అలా కనుగొన్న నాడే వైసీపీకి పులివెందుల అయినా కడప అయినా రాయలసీమ అయినా పూర్తి పూర్వ వైభవం దక్కుతుందన్న విశ్లేషణలు అయితే ఉన్నాయి. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# రేవంత్‌కు ఇన్సల్ట్ జరిగిందా?.. ఏంటీ చర్చ!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవమానం జరిగిందా? ఆయన ఆవేదన చెందారా? అంటే.. ఔననే అంటున్నారు కాంగ్రెస్ నాయకులు. ఈ విషయంపై ప్రతిపక్షాలు కూడా కామెంటు చేస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి చూస్తున్నారు. అయితే.. ఈ విషయంలో జోక్యం చేసుకుని కేంద్రం బిల్లుకు అడ్డు పడుతోందన్న వాద నను రేవంత్ రెడ్డి వినిపిస్తున్నారు. అయితే.. ఢిల్లీలో ధర్నా చేయడం ద్వారా.. జాతీయస్థాయిలో తమ డిమాండ్‌ను చర్చించేలా చేయాలని ప్లాన్ చేశారు. అది జరిగింది. ఇక, ఈ పరిణామాలు ఇలా ఉంటే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయి.. ఈ విషయంపై ఏదో ఒకటి తేల్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. దీనికి గాను.. ఆయన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అంటే.. పక్కా ప్రూఫులు, బీసీలపై చేయించిన కులగణన రిపోర్టు.. వంటివాటిని కూడా సిద్ధంగా ఉంచుకున్నారు. రాష్ట్రపతి ఏం కోరినా సమర్పించేలా అధికారులనుకూడా రెడీ చేశారు. అయితే.. రాష్ట్రపతి అప్పాయింట్‌మెంటు విషయంలోనే సీఎం రేవంత్‌కు ఇన్సల్ట్ జరిగిందనే చర్చ తెర మీదికి వచ్చింది. తొలుత రాష్ట్రపతి కార్యాలయం నుంచి అప్పాయింట్‌మెంటును ఖరారు చేస్తూ.. సమా చారం అందినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ.. గంటలోనే ఈ సమాచారం డిలీట్ కావడం.. దీనిపై ఎలాం టి అప్‌డేట్ లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి కూడా.. రాష్ట్రపతి



అప్పాయింట్మెంటుపై ఆసక్తికర వ్యాఖ్య లు చేశారు. రాష్ట్రపతి అప్పాయింట్‌మెంటు ఇచ్చే విషయంలోనూ కేంద్ర పెద్దలుజోక్యం చేసుకుంటున్నా రని అన్నా రు. ఇది ప్రజాస్వామ్యంలో మంచిది కాదరని.. రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించే వారిని కూడా తమ చెప్పు చేతల్లో పెట్టుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే రెండు రోజులు గడుస్తోందని.. రాష్ట్రపతి అ ప్పాయింట్‌మెంటు కోసం వేచి చూస్తున్నామని అన్నారు. ఈ పరిణామాలపై ఇటు కాంగ్రెస్ పార్టీ నాయ కులు.. అటు విపక్ష నాయకులు కూడా అవ మానం జరిగిందనే వ్యాఖ్యలు చేస్తున్నారు. మరి ఎప్పటికి రేవం త్‌కు రాష్ట్రపతి అప్పాయింట్‌మెంటు లభిస్తుందో చూడాలి.

# కేసీఆర్...జైలూ...రేవంత్ కామెంట్స్ వైరల్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణాలో రాజకీయం పీక్స్ కి చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను ప్రభుత్వానికి అప్పగించడంతో ఒక్కసారిగా పాలిటిక్స్ హీటెక్కింది ఈ నివేదికలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఆరోపణలు ఉన్నాయి. అలాగే ప్రాజెక్ట్ ని పెద్ద ఎత్తున అప్పులు తెచ్చి అనవసర వ్యయం చేశారు అన్నది కూడా నివేదిక చెబుతోంది. దాంతో ఈ ప్రాజెక్టు నివేదికను అసెంబ్లీలో పెట్టి అందరి అభిప్రాయం తీసుకుని ఆ మీదట చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటోంది అన్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిజంగా ఈ కేసులో ఏమవుతుంది అన్న చర్చ అయితే అందరిలో ఉంది.

**కేసీఆర్ కేరాఫ్ ఫాం హౌస్ :**

తెలంగాణా జాతిపితగా తన పార్టీ క్యాడర్ చేత అభిమానుల చేత గొప్పగా పిలిపించుకునే కేసీఆర్ గత రెండేళ్ళుగా ఎర్రవెల్లి ఫాం హౌస్ కే పరిమితం అయ్యారు. ఆయన బయటకు పెద్దగా రావడం లేదు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఆయనను చూసేందుకు కూడా అభిమానులకు క్యాడర్ కి కూడా అంతగా అవకాశం అయితే దక్కడం లేదు ఒక విధంగా చూస్తే కేసీఆర్ కొందరు పార్టీ ముఖ్యులతో తప్ప ఎవరినీ కలవడం లేదు అని అంటున్నారు. దాంతో అదే ఆయనకు స్వీయ నిర్బంధంగా మారిందా అన్నది కూడా ప్రత్యర్థుల విమర్శగా ఉంది.

**అంతకంటే పెద్ద శిక్ష :**

తెలంగాణాను సాధించిన నేతగా రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కి తెలంగాణాలో ఇపుడు అధికారం పోయింది. దాంతో ఆయన జనాలకు దూరంగా ఫాం హౌస్ లో ఉంటున్నారు. ఒక విధంగా ఆయనకు ఆయనే స్వేయం నిర్బంధంలో ఉంటున్నారు అది చాలాదా అంటున్నారు తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి. ఆయనకు అంతకంటే పెద్ద శిక్ష వేరేగా కావాలా అని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ఉన్న ఎర్రవెల్లి ఫాం హౌస్ కి చర్లపల్లి జైలుకు పెద్ద తేడా ఏముంది అంటూ రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఎక్కడ అయినా ఒక్కటేగా అని అంటున్నారు.

**కక్ష సాధింపు లేదా :**

తనకు కేసీఆర్ మీద రాజకీయ కక్ష ఏమీ లేదని ఆయన విషయంలో కక్ష సాధింపు చర్యలు తీసుకోమని కూడా చెబుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నివేదిక మీద అసెంబ్లీలో చర్చింది ఆ మీదట ఏ రకమైన చర్యలు తీసుకోవాలో తీసుకుంటామని ఆయన అంటున్నారు. రేవంత్ రెడ్డి మాటలు బట్టి చూస్తే కేసీఆర్ కి జైలు అరెస్టు ఇలాంటివి అన్నీ ఏమీ ఉండవనే అంటున్నారు ఆయన విషయంలో తనకు కన్సర్న్ ఉందని అందుకే ఆయన అనారోగ్యం పాలు అయినపుడు కూడా వెళ్ళి పరామర్శించాను అని చెబుతున్నారు.

**అంతా వ్యూహాత్మకమేనా :**

జైలుకు కేసీఆర్ ని పంపుతారు అన్న వార్తలు ఒట్టివి అన్నది రేవంత్ రెడ్డి మాటలు స్పష్టం చేస్తున్నాయి. కేసీఆర్ ని నిజంగా ఈ వయసులో జైలుకు పంపిస్తే అది కచ్చితంగా కాంగ్రెస్ కే బూమరాంగ్ డెసిషన్ అవుతుంది అని అంటున్నారు. పైగా కేసీఆర్ కి ఒక్కసారిగా సానుభూతిని అందించిన వారు అవుతారని అంటున్నారు. జైలుకు వెళ్ళిన వారు అంతా విజేతలుగానే ఉన్నారని రాజకీయ వర్తమానం నిరూపిస్తోంది. అందుకే కేసీఆర్ విషయంలో కాంగ్రెస్ తొందరపడదనే అంటున్నారు. మొత్తానికి ఎర్రవెల్లి ఫాం హౌస్ చర్లపల్లి జైలు రెండూ ఒక్కటే అని రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ మాత్రం వైరల్ అవుతున్నాయి

# నన్ను రిలీజ్ చేసి వేలంలోకి పంపండి.. రాజస్థాన్‌కు సంజు శాంసన్ గుడ్ బై




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో చేరనున్నాడనే వార్తలు గత కొంతకాలంగా బాగా వైరల్ అయ్యాయి. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ శాంసన్ ను జట్టులోకి తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్టు తెలిపి ఈ వార్తలకు మరింత బలం చేకూర్చాడు. ఆ తర్వాత సంజు రాజస్థాన్ జట్టులోనే 2026 ఐపీఎల్ సీజన్ వరకు ఉంటాడనే వార్తలు చర్చనీయాంశమయ్యాయి. అయితే ఇప్పుడు సంజు శాంసన్ విషయంలో మరో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ వేలంలోకి వెళ్లనున్నట్టు దాదాపు కన్ఫర్మ్ అయినట్టు సమాచారం. సంజు చెన్నై జట్టులో చేరడం సంగతి పక్కన పెడితే అతను రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఉండడానికి ఆసక్తి చూపించినట్టు సమాచారం. రాజస్థాన్ ఫ్రాంచైజీని విడుదల చేయాలని అధికారికంగా రిక్వెస్ట్ చేసినట్టు క్రిక్‌బజ్ కన్ఫర్మ్ చేసింది. గురువారం (ఆగస్టు 7) క్రిక్‌బజ్‌లో నివేదిక ప్రకారం, సామ్సన్, రాజస్థాన్ రాయల్స్ కు మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయని.. తనని వేలంలోకి పంపాల్సిందిగా సంజు కోరినట్టు తెలుస్తోంది. సామ్సన్ ఇకపై రాయల్స్‌తో కొనసాగాలని కోరుకోవడం లేదని అతని కుటుంబ సభ్యులు బహిరంగంగా చెబుతున్నారు.

ఐపీఎల్ చరిత్రలో రాజస్థాన్ రాయల్స్ తరపున సంజు శాంసన్ అత్యధిక మ్యాచ్ (149) లు ఆడాడు. అంతేకాదు ఈ ఫ్రాంచైజీ తరపున 4027 పరుగులతో టాప్ స్కోరర్ గా కొనసాగుతున్నాడు. ఐపీఎల్ లో 2021 సీజన్‌కు ముందు సామ్సన్ రాజస్థాన్ కెప్టెన్ గా ఎంపికయ్యాడు. గత నాలుగు సీజన్ లలో శాంసన్ మొత్తం 67 మ్యాచ్‌ల్లో కెప్టెన్సీ చేసి 33 విజయాలను అందించాడు. 2025లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఘోరంగా ఆడింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలతో 9వ స్థానంలో నిలిచింది. ఈ సీజన్ లో ఓవరాల్ గా తొమ్మిది మ్యాచ్‌ల్లో 35.62 సగటు.. 140.39 స్ట్రైక్ రేట్‌తో శాంసన్ 285 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో శాంసన్ కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రమే చేశాడు.

**శాంసన్ పై మాకు ఆసక్తి ఉంది:**

"మేము సంజు శాంసన్ ను ఖచ్చితంగా మా జట్టులో పరిగణిస్తాము. అతను ఒక ఇండియన్ బ్యాటర్.. వికెట్ కీపర్ కూడా.

అదే విధంగా ఇన్నింగ్స్ ను కూడా ఓపెన్ చేయగలడు. అతను మాకు అందుబాటులో ఉంటే, ఖచ్చితంగా మా స్క్వాడ్ లో తీసుకోవడానికి ప్రయత్నిస్తాం. మేము ఇంకా ట్రేడ్ ఆప్షన్స్ ను ఇంకా నిర్ధారించుకోలేదు. కానీ అతడిని మా జట్టులో తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నాం. రాజస్థాన్ రాయల్స్‌తో మేము ఇంకా అధికారికంగా ఏమీ మాట్లాడలేదు". అని సూపర్ కింగ్స్ అధికారి ఒకరు అన్నారు.

# టేలర్ కంబ్యాక్ అదుర్స్.. మూడున్నరేళ్లు క్రికెట్ ఆడకపోయినా టాప్ స్కోరర్



**హైదరాబాద్ పెన్ పవర్:** జింబాబ్వే మాజీ కెప్టెన్ బ్రెండన్ టేలర్ పై ఐసీసీ నిషేధం ముగిసిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. న్యూజిలాండ్‌తో గురువారం (ఆగస్టు 7) ప్రారంభమైన రెండో టెస్టు ప్లేయింగ్ 11లో చోటు దక్కించుకున్నాడు. జింబాబ్వే క్రికెట్ లో వన్ ఆఫ్ ది బెస్ట్ బ్యాటర్ గా పేరున్న టేలర్ తన కంబ్యాక్ మ్యాచ్ లో అదరగొట్టాడు. జట్టు విఫలమైనా తాను మాత్రం రాణించాడు. 44 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఈ టెస్టులో మొదట బ్యాటింగ్ కు దిగిన జింబాబ్వే 125 పరుగులకే ఆలౌటైంది. వీటిలో టేలర్ 107 బంతుల్లో 6 ఫోర్లతో 44 పరుగులు చేసి జట్టు పరువును కాపాడాడు. 39 ఏళ్ల టేలర్ సెప్టెంబర్ 2021లో అకస్మాత్తుగా రిటైర్ అయిన తర్వాత ఎలాంటి క్రికెట్ ఆడుతూ కనిపించలేదు. టేలర్ 2004 నుంచి 2021 మధ్య జింబాబ్వే తరపున 34 టెస్టులు ఆడాడు. 36.25 యావరేజ్ తో 2320 పరుగులు చేశాడు. వీటిలో 6 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రీ ఎంట్రీలో ఈ వెటరన్ బ్యాటర్ ఫామ్ పై అనుమానాలు నెలకొన్నాయి. అయితే అందరి అంచనాలకు చెక్ పెడుతూ టేలర్ అద్భుతంగా రాణించాడు. కఠినమైన న్యూజిలాండ్ బౌలర్లను ఎదర్కొంటూ తనలోని పాత ఫామ్ ఇంకా అలాగే ఉందని నిరూపించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే తొలి ఇన్నింగ్స్ లో జింబాబ్వే 125 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టానికి 174 పరుగులు చేసింది.

**అసలేం జరిగిందంటే..?**

2022 లో బ్రెండన్ టేలర్ పై ఐసీసీ బ్యాన్ విధించింది. ఫిక్సింగ్ కు పాల్పడ్డాడని ఒప్పుకున్న టేలర్ కు..ఐసీసీ యాంటీ కరప్షన్ కోడ్ లో ఐసీసీ యాంటీ డోపింగ్ కోడ్ ను ఉల్లంఘించినందుకు అతడి మీద మూడున్నరేళ్ల పాటు నిషేధం వేసింది. 2019లో ఓ భారత వ్యాపారవేత్త, తనను మ్యాచ్ ఫిక్సింగ్ చేయమని బెదిరించాడని, అందుకు అతను 15 వేల అమెరికన్ డాలర్లు ఆఫర్ చేశాడని ట్విటర్ వేదికగా ఆరోపణలు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. 2021 సెప్టెంబర్‌లో ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టేలర్.. 2019లో ఓ ప్రముఖ భారత వ్యాపారవేత్త ఆహ్వానం మేరకు భారత్‌కు వచ్చానని, ఆ సందర్భంగా ఓ పార్టీలో కొందరు తనకు కొకైన్ ఆఫర్ చేశారన్నాడు. తాను కొకైన్ సేవిస్తుండగా వీడియోలు తీసి బెదిరించడం మొదలుపెట్టారని, ఈ క్రమంలోనే మ్యాచ్ ఫిక్సింగ్ కూడా చేయమన్నారని సంచలన స్టేట్‌మెంట్‌ను విడుదల చేశాడు.

# ఒకే ఫార్మాట్ లో 650 వికెట్లు.. టీ20 నెంబర్ వన్ బౌలర్‌గా ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్ లో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ లీగ్ జరిగినా ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ను పోటీ పడి మరీ తీసుకుంటారు. దశాబ్ద కాలానికి పైగా టీ20 క్రికెట్ లో తనదైన మార్క్ చూపిస్తున్నాడు. ఇప్పటికీ రషీద్ స్పిన్ బ్యాటర్లకు ఒక సవాలే. తన స్పిన్ మాయాజాలంతో టీ20 క్రికెట్ లో ఎన్నో రికార్డులు తన పేరిట లిఖించుకున్న రషీద్ ఖాన్.. తాజాగా టీ20 క్రికెట్ లో చరిత్ర సృష్టించాడు. టీ20 ఫార్మాట్ లో అత్యధిక వికెట్లు తీసుకొన్న బౌలర్ గా రికార్డులకెక్కిన రషీద్.. ఈ ఫార్మాట్ లో మరో సరికొత్త రికార్డ్ ను నెలకొల్పాడు. టీ20 ఫార్మాట్ లో 650 వికెట్లు తీసిన తొలి ఆటగాడిగా రషీద్ ఖాన్ చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నాడు. మంగళవారం (ఆగస్టు 5) లార్డ్స్‌లో జరిగిన ది హండ్రెడ్ లీగ్ తొలి మ్యాచ్ లో ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ఈ ఘనతను అందుకున్నాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ తరపున ఆడుతున్న రషీద్ లండన్ స్పిరిట్‌పై మూడు వికెట్లు పడగొట్టి ఈ మైలురాయిని చేరుకున్నాడు. వేన్ మాడ్సెన్, లియామ్ డాసన్, ర్యాన్ హిగ్గిన్స్‌లను ఔట్ చేసి ప్రత్యర్థి జట్టు 80 పరుగులకే ఆలౌట్ అయ్యేలా చేశాడు. ఓవరాల్ గా టీ20 క్రికెట్ లో రషీద్ ఖాన్ 478 ఇన్నింగ్స్‌ల్లో 18.54 సగటుతో 651 వికెట్లు పడగొట్టాడు. 582 మ్యాచ్‌ల్లో బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో.. 589 వికెట్లతో వెస్టిండీస్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ (547), బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్ (498) వికెట్లతో నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. 26 ఏళ్ల ఈ రషీద్ ఖాన్ ఇటీవలే జరిగిన ఐపీఎల్ సీజన్ 2025లో పెద్దగా రాణించలేదు. 15 మ్యాచ్‌లలో 57.11 సగటుతో 9 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. ఐపీఎల్ లో విఫలమైనా హండ్రెడ్ లీగ్ లో ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ఫామ్ లోకి వచ్చాడు.

# వాటిని కాదన్నందుకు హృతిక్ ఆవేదన







ఐశ్వర్య రాజేష్ తాజా ఫోటోలో జీవితంలోని సాధారణ క్షణాలను స్వీకరించింది

బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ హీరోగా నటించిన వార్ 2 సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈనెల 14న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కాబోతుంది. ఎన్టీఆర్ కీలక పాత్రలో నటించిన కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. వార్ 2 సినిమా ట్రైలర్‌కి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో మేకర్స్ అదే పాజిటివ్ బజ్ కంటిన్యూ అయ్యే విధంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. వార్ 2 సినిమా ప్రమోషన్‌లో భాగంగా హృతిక్ రోషన్ ఇటీవల ఒక చిట్ చాట్‌లో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ముఖ్యంగా కెరీర్ ఆరంభం నుంచి హృతిక్ వదులుకున్న కొన్ని ప్రాజెక్టుల గురించి చెప్పుకొచ్చాడు. ఆ ప్రాజెక్టుల గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చర్చ జరుగుతోంది.

అమీర్ ఖాన్ దిల్ చహ్తే హై హృతిక్ రోషన్ కెరీర్ ఆరంభంలో 'దిల్ చహ్తే హై' చేయాల్సి ఉంది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 2001లో ఆ సినిమా ఛాన్స్ హృతిక్ రోషన్ వద్దకు మొదట వచ్చిందట. కొన్ని కారణాల వల్ల ఆ సినిమాను హృతిక్ చేయలేక పోయాడు. అదే సమయంలో మంచి జోష్ లో ఉన్న అమీర్ ఖాన్ ఆ సినిమాను చేశాడు. అమీర్ ఖాన్ చేసిన దిల్ చహ్తే హై సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమాను వదిలేసినందుకు ఖచ్చితంగా హృతిక్ రోషన్ ఫీల్ అవుతూ ఉంటాడని అంతా అనుకుంటూ ఉంటారు. తాజాగా అదే విషయాన్ని గురించి హృతిక్ రోషన్ మాట్లాడుతూ ఆ సినిమాను చేయలేకపోయినందుకు ఖచ్చితంగా బాధగా ఉందని, ఒక మంచి సినిమా మిస్ అయినందుకు చింతించకుండా ఎలా ఉంటామని అన్నాడు.

**3 ఇడియట్స్ హృతిక్ రోషన్ చేయాల్సింది**

దిల్ చహ్తే హై సినిమా తర్వాత రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో చేయాల్సిన '3 ఇడియట్స్' సినిమాను సైతం వదిలేసినట్లు హృతిక్ రోషన్ చెప్పుకొచ్చాడు. ఆ సినిమా కథ విషయంలో చర్చలు జరుగుతున్న సమయంలోనే కొన్ని కారణాల వల్ల తప్పుకున్నట్లు హృతిక్ చెప్పుకొచ్చాడు. ఆ సినిమాను ఆమీర్ ఖాన్ చేయడం, భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం తెలిసిందే. 3 ఇడియట్స్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా ఒక గొప్ప సినిమాగా ఇండియన్ సినీ చరిత్రలో నిలిచిపోయింది. అలాంటి సినిమాను మిస్ అయినందుకు ఖచ్చితంగా చింతిస్తున్నాను అంటూ హృతిక్ రోషన్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. మంచి కథలు, మంచి సినిమాలు అప్పుడప్పుడు మిస్ కావడం అందరికీ సహజమే.

**వార్ 2 బాక్సాఫీస్ ను షేక్ చేయడం ఖాయం**

ఆ రెండు సినిమాలను మిస్ చేసుకున్నందుకు చింతిస్తున్నాను అంటూనే ఆ రెండు సినిమాలు అమీర్ ఖాన్ వంటి మంచి నటుడు చేయడం వల్ల లాభం పొందాయి అని నేను భావిస్తున్నాను అన్నాడు. గొప్ప సినిమాలకు మంచి నటులు అవసరం. ఆ కథలు అమీర్ ఖాన్ కి మరింతగా సెట్ అయ్యాయి అనిపిస్తుందని హృతిక్ రోషన్ చెప్పుకొచ్చాడు. ఆ సినిమాలు నేను చేసి ఉంటే బాగుండేది అని అనుకోవడం తో పాటు అమీర్ ఖాన్ ఆ సినిమాలు చేయడం వల్ల మంచి ఫలితం దక్కింది అనేది ఆయన మాట. వార్ సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న హృతిక్ రోషన్ ఈ సినిమాతో అంతకు మించిన బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంటాను అనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. హృతిక్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సినిమా ఖచ్చితంగా రూ.1000 కోట్ల సినిమా అంటున్నారు. మరి ఈ స్పై థ్రిల్లర్ ఏ మేరకు హిట్ అయ్యేనో చూడాలి.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com